7. 3. 2026
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
శనివారం | రంగారెడ్డి , నల్లగొండ
సంపుటి :07 సంచిక : 270 , పేజీలు : 12 వెల:రూ.5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH
తెలుగు దిన పత్రిక
www.velthuru.com
velthuru Newspaper



## మూసీ చుట్టూ నైట్ టూరిజం అభివృద్ధి

కొత్వాల్ గూడ ఎకో పార్క్ ప్రారంభించిన సిఎం రేవంత్

# ప్రజల మద్దతుతో పాలన సాగిస్తున్నాం







- మా వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదు
- వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మద్దతుగా నిలిచా
- మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి6 వెలుతురు:** చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని తెలిపారు. ఇది మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే

# ప్రజాపాలన ప్రగతికి సరికొత్త బాట

## 99 రోజుల కార్యాచరణతో సత్ఫలితాలు సాధించాలి

## రెవెన్యూ - అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**ఖమ్మం వెలుతురు మార్చి 06:** ప్రజలకు మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.... క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని దిశానిర్దేశం చేశారు.



**సాంకేతిక లోపాలు సరిదిద్ది.. బాధ్యతను నిర్ధారించాలి**

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గతంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాల్లో చోటుచేసుకున్న లోపాలపై మంత్రి

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' అమలుపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంత్రి జూపల్లి సమీక్ష



## సివిల్స్ ఫలితాలు విడుదల

- సత్తా చాటిన తెలుగు అభ్యర్థులు,
- అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్




## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను

# సమష్టిగా అందరం సక్సెస్ చేద్దాం..

- కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అగ్రభాగాన నిలుపుదాం.
- ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి..
- అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి ప్రధాన లక్ష్యం..
- ప్రధాన సమస్యలన్నింటిని పరిష్కరించుకుందాం..
- జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా జరుపుకుందాం..
- రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..




- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరు..
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను రాజకీయాలకు అతీతంగా విజయవంతం చేయాలి..
- కరీంనగర్ జిల్లాను ఆదర్శంగా నిలుపుదాం..
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్..

**కరీంనగర్ వెలుతురు మార్చి 06:** సన్నాక సమావేశంలో పాల్గొన్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎంపీ ,ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, ఆయా జిల్లాల కలెక్టర్లు, సిపి ఎస్పీలు అదనపు కలెక్టర్లు

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో 99 రోజులపాటు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ యంత్రాంగము ప్రజా ప్రతినిధులు ప్రజలు, అందరం కలిసి విజయవంతం చేద్దామని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో తీసుకెళ్లి అగ్ర భాగాన నిలుపుతామని పేర్కొన్నారు. ఒకవైపు సంక్షేమాన్ని మరోవైపు అభివృద్ధిని రాష్ట్ర

## తెలంగాణ నుంచి సివిల్ సర్వీసెస్ 2025లో విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు

- టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మార్చి 06:** సివిల్ సర్వీసెస్2025 తుది ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు విశేష ప్రతిభ కనబరిచి దేశవ్యాప్తంగా మంచి ర్యాంకులు సాధించడం ఆనందకరమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



## రాజ్యసభ నామినేషన్ల పరిశీలన

- స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ
- సింఘ్వీ, వేం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లే

**హైదరాబాద్,మార్చి6:** రాజ్యసభ అభ్యర్థులు దాఖలు చేసిన

## 9 నుంచి పార్లమెంట్ రెండోదశ సమావేశాలు

- ఈ సమావేశాల్లోనే స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసం
- ఎంపిలకు విప్ జారీ చేసిన బిజెపి, కాంగ్రెస్ పార్టీలు



## అసంపూర్తిగా అంబర్‌పేట పై ఓవర్ సర్వీస్ రోడ్డు

- వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి
- సిఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

**హైదరాబాద్,మార్చి6 వెలుతురు:** అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను

## 13 ఏళ్లలోపు వారికి

# సోషల్ మీడియా బ్యాన్



- సోషల్ మీడియాతో పిల్లలు నష్టపోవడానికి వీల్లేదు
- అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- 25 నూతన పాలసీలతో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- 3 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం
- స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్
- లడ్డూ కల్తీ జరిగినా ఇంకా క్షమాపణలు చెప్పరా
- అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో సిఎం బాబు

**అమరావతి,మార్చి6 వెలుతురు:**



- కొత్త గవర్నర్ రాకతో తెలంగాణలో పరిణామాలు మారుతాయా?
- పెండింగ్‌లో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు
- కొత్త గవర్నర్ వీటిని ఆమోదిస్తారా లేదా అన్నదానిపై చర్చ
- నాలుగు నెలలుగా అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీలు పెండింగ్
- కొత్త గవర్నర్ కూడా అజారుద్దీన్ ఎమ్మెల్సీ ఆమోదించకపోతే మంత్రి పదవి ఊడే అవకాశం

**హైదరాబాద్ వెలుతురు మార్చి 06:**



## మూడు వారాల్లో క్యాతన్ పల్లి ఎన్నిక

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్,మార్చి6 వెలుతురు:** క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మూడు వారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాతనపల్లి

వెలుతురు

## మూసీ చుట్టూ నైట్ టూరిజం అభివృద్ధి

**రంగారెడ్డి,మార్చి6 వెలుతురు:**

మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మూసీ చుట్టూ వ్యాపారాలు, నైట్ టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాలోని కొత్వాల్‌గూడ ఎకో పార్కును శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫామ్‌హౌస్‌లో ఉన్నవారికి పేదల కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. నేను సీఎం అయిన తర్వాత రేషన్ కార్డు ఇచ్చా. సన్నబియ్యం ఇచ్చా. ఫ్రీ బస్సు పథకం ఇచ్చా. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మహిళలంతా నిండు మనసుతో ఆశీర్వదించాలని అన్నారు.మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం. అభివృద్ధి విషయంలో రాజకీయాలు లేవు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయ ఉపన్యాసాలకు తావులేదు. అందర్నీ కలుపుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపిస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొత్వాలగూడలో ఎకో హిల్ పార్క్ ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బుద్వేల్ లేఅవుట్‌తో కలిపే రేడియల్ రోడ్-2 ఇంటర్‌చేంజ్‌కు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి,ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,మల్లు రవి,ఎంఎల్ ఏలు ప్రకాష్ గౌడ్, మల్‌రెడ్డి రంగా రెడ్డి ,సీఎం మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులుహాజరయ్యారు. ఈ సందర్భంగా ఎకో హిల్ పార్క్ ను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించి పరిశీలించారు.

## సివిల్స్ ఫలితాలు విడుదల

**న్యూఢిల్లీ,మార్చి6 వెలుతురు:**

సివిల్స్ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి సువే రెండో స్థానంలో నిలిచారు. ఆకాన్ష ధుల్ మూడో ర్యాంక్ పొందారు. రాఘవ్ ఝున్‌ఝున్ వాలా నాలుగో ర్యాంక్ సాధించారు. ఈ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులు సత్తా చాటారు. సృజన (55వ ర్యాంక్), డీఎస్‌కే ప్రచేత్ (193వ ర్యాంక్), ఎస్. వర్షిత్‌రెడ్డి (259వ ర్యాంక్), ఎం.పవన్‌కుమార్‌రెడ్డి (297వ ర్యాంక్), వి. విక్రమసింహారెడ్డి (541వ ర్యాంక్), గుమ్మల శ్వేత (573వ ర్యాంక్), పోతుపురెడ్డి భార్గవ్ (537వ ర్యాంక్), పుదారి రాహుల్ (748వ ర్యాంక్), కత్తిమాని అనిరుధ్ (786వ ర్యాంక్), కోరపాతుల శ్రీకర్‌రాజు (806వ ర్యాంక్), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823 ర్యాంక్), కట్టా ప్రత్యూష (908వ ర్యాంక్), గోగుల రాజశేఖర్ (920వ ర్యాంక్), గుగులోతు జితేందర్ నాయక్ (939వ ర్యాంక్) సాధించారు. ఈ పరీక్షా ఫలితాలు విడుదలైన 15 రోజుల్లో వెబ్ సైట్‌లో మార్కులు అప్ లోడ్ చేస్తామని యూపీఎస్సీ ప్రకటించింది. మరిన్ని వివరాలు కోసం ఈ ఫోన్ నెంబర్లు.. 23385271, 23381125, 23098543 సంప్రదించాలని ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సూచించింది. ఉదయం 10 నుంచి 05.00 గంటల మధ్య సంప్రదించాలని యూపీఎస్సీ స్పష్టం చేసింది. గతేడాది అంటే.. 2025లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఆగస్ట్, సెప్టెంబర్‌లో మెయిన్స్ పరీక్షలు చేపట్టారు. వాటిలో అర్హత పొందిన వారికి ఈ ఏడాది ఫిబ్రవరిలో మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ చివరి వడపోతలో మొత్తం 1087 మంది అభ్యర్థులు సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్‌తో పాటు గ్రూప్ ఎ, గ్రూప్ బిలో వివిధ సెంట్రల్ సర్వీస్‌లో వీరంతా చేరనున్నారు.

## మూడు వారాల్లో క్యాతన్ పల్లి ఎన్నిక

మున్సిపాలిటీ వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు పై విధంగా ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లిలో పలు రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అర్ధంతరంగా నిలిచిపోయింది. ఇక బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా.. ఇటీవల బెయిల్ మంజూరు అయింది. అనంతరం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత కేతనపల్లిలోని తన నివాసంలో బాల్క సుమన్ విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎంపీ వంశీ కృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తనను జైల్లో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారంటూ పోలీసులపై ఆయన మండిపడ్డారు. ఫిబ్రవరి 11వ తేదీన తెలంగాణలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు పోలింగ్ నిర్వహించారు. ఫిబ్రవరి 14వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అనంతరం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ పదవుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాగే క్యాతనపల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వేళ.. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఆగిపోయింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ నేతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.

## రాజ్యసభ నామినేషన్ల పరిశీలన

నామినేషన్ల పత్రాలు పరిశీలన శుక్రవారం పూర్తయింది. ఈ సందర్భంగా ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన సాయి అనే వ్యక్తి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. రాజ్యసభ అభ్యర్థిగా బలపరుస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు నామినేషన్ పత్రాలు ఉండాలని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. కానీ ఆ సంతకాలు సాయి దాఖలు చేసిన నామినేషన్ పత్రాలపై లేవని అధికారులు వివరణ ఇచ్చారు. అందువల్ల ఈ పత్రాలను తిరస్కరించినట్లు వారు తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. అభిషేక్ సింఘ్వీకి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వరుసగా మరోసారి అవకాశం కల్పించింది. ఇక వేం నరేందర్ రెడ్డిని తొలిసారిగా రాజ్యసభకు ఎంపిక చేసింది. అసలు అయితే రాజ్యసభ సీటు ఒకటి అభిషేక్ మను సింఘ్వీకి కేటాయిస్తున్నట్లు పార్టీ అధిష్ఠానం గతంలో ప్రకటించింది. ఇక మరో రాజ్యసభ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో చాలా మంది పోటీ పడ్డారు. దాదాపు 16 మందితో కూడిన జాబితాను సిద్ధం చేసి .. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తీసుకు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతో చర్చించి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని ఎంపిక చేశారు. వివాదరహితుడు కూడా కావడంతో.. ఆయన వైపు అధిష్ఠానం మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

## తెలంగాణ నుంచి సివిల్ సర్వీసెస్ 2025లో విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు



పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన అభ్యర్థులందరికీ ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పట్టుదల, కృషి, లక్ష్యసాధన పట్ల నిబద్ధతతో తెలంగాణ యువత సివిల్ సర్వీసెస్ వంటి అత్యున్నత పరీక్షల్లో సత్తా చాటడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన అన్నారు. భవిష్యత్తులో దేశ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని విజేతలకు ఆకాంక్షించారు. సివిల్స్ సాధించే లక్ష్యంతో సిద్ధమవుతున్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు అవసరమైన ఆర్థిక మద్దతు అందిస్తూ వారి కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అలాగే సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన 202 మంది అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించబడినట్లు తెలిపారు. ఈ సహాయం పొందిన అభ్యర్థుల్లో 51 మంది ఇంటర్వ్యూకు ఎంపిక కావడం, వారిలో 20 మంది తుది ఫలితాల్లో మంచి ర్యాంకులతో విజేతలుగా నిలవడం గర్వకారణమని అన్నారు. ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాల ద్వారా తెలంగాణ యువత మరింతగా సివిల్ సర్వీసెస్ వైపు ముందుకు రావాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.

# ప్రజల మద్దతుతో పాలన సాగిస్తున్నాం

ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని వివరించారు. తమది పేదల పక్షపాత ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ఎన్నికల్లో తాము మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల మద్దతుతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదన్నారు. వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుంచీ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని తెలిపారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని వివరించారు. మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని చెప్పారు. కర్ణుడి మాదిరిగా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత.. వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు. ప్రగతి ప్రణాళికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులకు సీఎం రేవంత్ హితవు పలికారు. తెలంగాణలో ఆర్థిక సమస్యలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్నారు.ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉందని తెలంగాణ సీఎం తెలిపారు. మాదిగలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ మనకు తెలియవా?.. వీళ్లు కొత్తగా ఇచ్చిందేంటి? అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ మండిపడ్డారు. మనం బర్రెలు, గొర్రెలు కాచుకోవాలా?.. వాళ్ల పిల్లలు రాజ్యం ఏలుతారా? అంటూ ఆ పార్టీ నేతలను సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కడియం శ్రీహరి, ఎంపి కడియం కావ్య, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు

ప్రస్తావించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న రూ. 1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి మీద ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. తద్వారా తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలు కూడా తక్కువ సమయంలోనే జాతీయ రహదారులతో అనుసంధానించామని.. ఇది చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ.265 కోట్ల వ్యయంతో ఔఊ163 (గతంలో ఔఊ-202) మీద నగరంలోని అంబర్‌పేట క్రాస్ రోడ్డు వద్ద 1.5 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల ౧÷÷-ల ఓవర్‌ను నిర్మించిందని గుర్తుచేశారు. 5 మే, 2025 నాడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ ఫ్లై ఓవర్‌ను ఘనంగా ప్రారంభించారని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తనతోపాటుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ ౧÷÷-ల ఓవర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తి కాలేదని అన్నారు. దీని నిర్మాణం జరిగి, ప్రారంభోత్సవం కూడా పూర్తి చేసుకున్నప్పటికీ దీని కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తిస్థాయిలో జరగలేదని తెలిపారు. భూసేకరణ విషయంలో కొన్ని శక్తులు అడ్డుతగులుతోండటంతో అనవసరంగా తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది 2018లో మంజూరయినప్పటికీ లేని సమస్యలు సృష్టించి భూసేకరణ పూర్తి కాకుండా కుట్రలు చేసి సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో జరగనివ్వకపోవడంతో ఈ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ఈ విషయాన్ని అప్పటి సీఎం కె. చంద్రశేఖరరావు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి అనేకసార్లు తెలియజేశానని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ మంత్రులకు స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా అనేకసార్లు తెలియజేశారని అన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, ఇతర సంబంధిత అధికారుల దృష్టికి తాను కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లి అనేకసార్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసినప్పటికీ, ఈ సమస్య ఓ కొలిక్కి రాలేదని చెప్పుకొచ్చారు. భూసేకరణకు సంబంధించిన భూమికి రూ. 2.54 కోట్ల పరిహారం లబ్దిదారులకు ప్రభుత్వం చెల్లించినప్పటికీ మధ్య దళారులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపించి, సర్వీసు రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత జీహెచ్ఎంసీ, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకొని సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించటానికి సహకరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను సమష్టిగా అందరం సక్సెస్ చేద్దాం..

ప్రభుత్వం పరుగులు పెట్టిస్తున్నదని తెలిపారు. రెండున్నర సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలందరికీ వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు ,ఎమ్మెల్యేలు పెద్దపెల్లి ఎంపీ ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లు సిపి, ఎస్పీలు అడిషనల్ కలెక్టర్లు అన్ని శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇరిగేషన్, ఆర్ అండ్ బి కి సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 99 రోజులపాటు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామాలు పట్టణాల్లో ప్రధాన సమస్యలన పరిష్కారం.. రెండున్నర సంవత్సరాల ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికీ అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో దేశంలోనే మహత్తరమైన అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. దేశానికే తెలంగాణ మోడల్ అభివృద్ధిలో నిలుస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి లక్ష కోట్లు బడ్జెట్ కేటాయించిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనని పేర్కొన్నారు. అత్యధికంగా పంట పండించడంలోనూ అత్యధికంగా ధాన్యాన్ని సేకరించడం లో తెలంగాణ ప్రభుత్వానికి సాటి ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఇరిగేషన్ తోపాటు విద్యుత్ రంగంలోనూ మంచి ఫలితాలు ప్రభుత్వం సాధిస్తుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం




ముందుండి 99 రోజుల పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్లు ముందుండి నడిపించాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధికారులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.సన్నాహక సమావేశంలో సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు సమష్టిగా సఫలీకృతంగా ఈ కార్యక్రమాన్ని అందరం కలిసికట్టుగా ఉంటూ 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని పూర్తి చేద్దామన్నారు. తద్వారా కరీంనగర్ జిల్లాను అగ్ర భాగాన నిలుపుదామని పేర్కొన్నారు.

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను రాజకీయాలకతీతంగా విజయవంతం చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని రాజకీయాల కతీతంగా అందరూ కలిసి విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్లు యంత్రాంగం ముందుండి విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడ కూడా ఎటువంటి గ్యాప్స్ లేకుండా ఈ ప్రణాళిక ను సమర్థవంతంగా నిర్వహించేలా కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, రోడ్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇండ్లలో శిథిలావస్థలో ఉన్న టీవీలు కంప్యూటర్లు ఇతర వస్తువులను ఈ వేస్ట్ విధానం ద్వారా సేకరించాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఒక బృహత్తరమైన ఆశయంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారని ప్రజలందరూ పెద్ద బాధ్యతగా తీసుకొని సక్సెస్ చేయాలని పేర్కొన్నారు. ఇందులో వార్డు మెంబరు నుంచి సర్పంచులు, కౌన్సిలర్లు కార్పొరేటర్లు మున్సిపల్ చైర్మన్లు మేయర్లు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలు అందరూ స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు. రహదారి భద్రత కింద ప్రత్యేకంగా ఇందులో భాగంగా కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. సురక్షితంగా చేరుకోండి అనే నినాదంతో ఏప్రిల్ 13 నుంచి ఏప్రిల్ 18 వరకు హోంశాఖ రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణల లక్ష్యంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో మహత్తరమైన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సత్వరమే స్పందించి ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం రహ వీర్ పేరిట తగిన ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



# ప్రజాపాలన ప్రగతికి సరికొత్త బాట

సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో సరైన లెవల్స్ లేకపోవడం వల్ల మురుగునీరు నిలిచిపోయి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేకంగా సమావేశమై, ఎక్కడైతే నీరు ఆగుతుందో ఆ ప్రాంతాలను గుర్తించి తక్షణమే సరిచేయాలని ఆదేశించారు. అవసరమైతే లోపభూయిష్టమైన నిర్మాణాలను తొలగించి, కొత్తగా నిర్మించాలని సూచించారు. ఏ అధికారి హయాంలో ఈ పొరపాట్లు జరిగాయో రికార్డుల్లో నమోదు చేసి, వారిని బాధ్యులను చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

**అటవీ - రెవెన్యూ సరిహద్దు వివాదాలకు ముగింపు**

ఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న అటవీ మరియు రెవెన్యూ భూముల వివాదాలను పరిష్కరించేందుకు ఈ 99 రోజుల ప్రణాళికను వేదికగా చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లెందు, వైరా వంటి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా





ఉందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. కలెక్టర్లు, డి.ఎఫ్.ఓలు మరియు రెవెన్యూ యంత్రాంగం ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సరిహద్దులను ఖరారు చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా నూటికి నూరు శాతం పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ.. నిధుల వినియోగం**

కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, మేయర్లు మరియు చైర్మన్లకు పాలనాపరమైన అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ నెల 12న ఉమ్మడి జిల్లా స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అనుభవజ్ఞులైన అధికారులతో ఈ శిక్షణ ఇప్పించడం ద్వారా, గ్రామాల్లో నిధుల వినియోగంపై వారికి స్పష్టత వస్తుందన్నారు. ముఖ్యంగా గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పంచాయతీ నిధులు ఇప్పుడు విడుదలవుతున్నాయని, వాటిని గ్రామాభివృద్ధికి పారదర్శక పద్ధతిలో ఖర్చు చేసేలా విలేజ్ సెక్రటరీలతో కలిసి పని చేయాలని సూచించారు.

**సాగు పద్ధతుల్లో మార్పు.. రైతుల్లో చైతన్యం**

వ్యవసాయ రంగంలో రైతులు విచక్షణారహితంగా వాడుతున్న ఎరువులు, పురుగుమందుల ప్రభావం భూసారంపై పడుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రైతుకూ భూసార పరీక్షలు, పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అధికారులే నేరుగా రైతుల వద్దకు వెళ్లి ఆధునిక సాంకేతికతను వివరించాలని, అవసరమైతే ఇతర ప్రాంతాల్లోని ఆదర్శ సాగు పద్ధతులను పరిశీలించేందుకు ప్రభుత్వ ఖర్చుతో రైతులకు క్షేత్ర పర్యటనలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

## పార్టీలకు అతీతంగా ప్రజా సేవ

ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉన్నా, గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులందరూ ప్రజల కోసమే పని చేయాలని మంత్రి ఉద్ఘాటించారు. ఈ అభివృద్ధి ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీలనే భేదం లేకుండా అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అధికారులు మరింత శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాలో అంతరాయం..

**హైదరాబాద్ వెలుతురు, మార్చి 6:**






హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్-3, పెద్దాపూర్ లోని పంప్ హౌస్ లో 35 సంవత్సరాలకు పైగా పాతబడిన హెచ్‌టి (హై టెన్షన్) ఎలక్ట్రికల్ ప్యానెల్స్‌ను తొలగించి, వాటి స్థానంలో కొత్త ప్యానెల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. అదే సమయంలో, పెద్దాపూర్ నుంచి సింగాపూర్ వరకు ఉన్న 1600 మిమీ డయా పంపింగ్ మెయిన్ పైప్‌లైన్‌లోని ఎయిర్ వాల్వ్‌లను, అలాగే సింగాపూర్ నుంచి పెద్దాపూర్ వరకు ఉన్న 2000 మిమీ డయా గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్‌లోని ఎయిర్ వెంట్స్‌ను మార్పిడి చేస్తూ మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ పనులను తేది.07.03.2026, శనివారం ఉదయం 8 గంటల నుంచి మరుసటి రోజు అనగా తేది.08.03.2026, అదివారం రాత్రి 8 గంటల వరకు చేపట్టనున్నారు. కావున ఈ 36 గంటలు కింద పేర్కొన్న కొన్ని ప్రాంతాల్లో లో ప్రెజర్ తో నీటిసరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు

**1.ఓ అండ్ ఏం డివిజన్ నెం.3:**

షేక్‌పేట్ రిజర్వాయర్‌కు నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుంది.

భోజగుట్ట ప్రాంతానికి తక్కువ ఒత్తిడితో నీటి సరఫరా ఉంటుంది.

**2. ఓ అండ్ ఏం డివిజన్ నెం.18:**

మణికొండ, కోకాపేట్, నర్సింగి, మంచిరేవుల తదితర ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదు.

**3. ట్రాన్స్‌మిషన్ I & II:**

నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుంది.

కాబట్టి.. పైన పేర్కొన్న ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని అధికారులు కోరతున్నారు

# ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్దే లక్ష్యంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

**- ప్రజల అభివృద్ధే మా ధ్యేయం సంక్షేమమే మా సంకల్పం**

**- ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్దే లక్ష్యంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక**

**- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు**

**తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొన్నం ప్రభాకర్,**

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హార్కరా వేణుగోపాల్ రావు**



**కరీంనగర్ వెలుతురు మార్చి 06:**

ప్రజల సంక్షేమం మరియు సమగ్ర అభివృద్దే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు , మంత్రి పొన్నం ప్రభాకర్ , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హార్కరా వేణుగోపాల్ రావు పాల్గొన్నారు. మార్చి 6 నుండి జూన్ 12 వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అమలు కానున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్ర దిశానిర్దేశం చేశారు. ఈ 99 రోజుల ప్రణాళికలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్య సేవలు, ప్రజల భద్రత, సంక్షేమ కార్యక్రమాలు, పిల్లల రక్షణ, డ్రగ్స్‌కు నో ప్రచారం, విద్యాభివృద్ధి, యువత మరియు క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై మండల, నియోజకవర్గ మరియు జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు మరియు జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై చర్చించి సమీక్షించారు.

# సి ఆర్ వై ప్రోగ్రామ్ - స్టెమ్మింగ్ స్టాంగ్ బ్రేకింగ్ బారియర్స్ టు బిల్డింగ్ బ్రేక్‌త్రూస్

**అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, CRY చైల్డ్ రైట్స్ అండ్ యు సంస్థ**

శనివారం, 07 మార్చి 2026న హైదరాబాద్ బేగంపేటలో గల టూరిజం ప్లాజా నందు "స్టెమ్మింగ్ స్టాంగ్ బ్రేకింగ్ బారియర్స్ టు బిల్డింగ్ బ్రేక్‌త్రూస్" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

ఈ కార్యక్రమంలో ాుజువీ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మాథమేటిక్స్) విద్యలో బాలికల భాగస్వామ్యంపై CRY ఇటీవల నిర్వహించిన అధ్యయనంలోని ముఖ్యాంశాలను చర్చిస్తారు. అలాగే తెలుగు రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురు బాలికలు అవరోధాలను అధిగమిస్తూ STEM విద్య, వృత్తుల్లో ముందుకు సాగుతున్న స్ఫూర్తిదాయక ప్రయాణాలను కూడా ఈ సందర్భంగా పంచుకుంటారు.

ఈ కార్యక్రమానికి మీడియా ప్రతినిధులు హాజరై కవరేజ్ ఇవ్వవలసిందిగా కోరుతున్నాము.

## కార్యక్రమం వివరాలు

**తేదీ: 7 మార్చి 2026 సమయం: ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 04:00 వరకు స్థలం: టూరిజం ప్లాజా, బేగంపేట్, హైదరాబాద్**

ధన్యవాదాలతో పృథ్వీరాజ్ మీడియా రిలేషన్స్ CRY సౌత్ రీజియన్ ఫోన్ 9948592340 ఇ-మెయిల్: Prithviraju.P@crymail.org

# సత్యం - మార్గం లేని దేశం - జిడ్డు కృష్ణమూర్తి అంతరంగ ప్రయాణం




**డా .సూర్యదేవర రామకృష్ణ ,**

9490754169

*ఇరవయ్యో శతాబ్దపు మేధో ప్రపంచంలో జిడ్డు కృష్ణమూర్తి ఒక విస్మయం. ఆయన మాటలు కేవలం ఉపన్యాసాలు కావు,అవి మనిషి తనను తాను చూసుకునే అద్దాలు. సాధారణంగా తాత్వికులు సిద్ధాంతాలను బోధిస్తారు, మార్గాలను నిర్దేశిస్తారు. కానీ కృష్ణమూర్తి మాత్రం ఏ మార్గాన్నీ అనుసరించకండి అని చెప్పడం ద్వారానే ఒక గొప్ప విప్లవాన్ని సృష్టించారు. మానవ మనస్సు, స్వేచ్ఛ, అవగాహన మరియు సత్యానికి సంబంధించిన లోతైన సత్యాలను ఆయన ప్రపంచానికి పరిచయం చేశారు. ఆయన బోధనలు ఏ మతానికి చెందినవి కాదు, ఏ రాజకీయ విచారధారకూ అనుకూలమైనవి కాదు. ఆయన ఎప్పుడూ ఒకటే మాట చెప్పేవారు: స్వేచ్ఛ అనేది బయటి నుండి రాదు, అది మీ లోపలే ఉంది. ఈ మాటల వెనక దాగిన తత్వం అర్థం చేసుకోవడం నేటి సంక్లిష్ట కాలంలో ప్రతి మనిషికీ ఎంతో అవసరం.*

1895 మే 12న ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో జన్మించిన జిడ్డు కృష్ణమూర్తి జీవితం ఒక సినిమాను తలపిస్తుంది. థియోసాఫికల్ సొసైటీ నాయకులైన అన్నీ బిసెంట్ మరియు సి.డబ్ల్యు. లీడ్‌బీటర్ ఆయనను ప్రపంచ గురువు (World Teacher)గా గుర్తించారు. చిన్నతనం నుండే ఆయనపై ఎనలేని అంచనాలు మోపబడ్డాయి. ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అనే అంతర్జాతీయ సంస్థను స్థాపించి, ఆయనను దానికి నాయకుడిగా నిలబెట్టారు. వేలమంది శిష్యులు, అపారమైన ఆస్తిపాస్తులు ఆయన పాదాక్రాంతమయ్యాయి. కానీ 1929లో నెదర్లాండ్‌లోని ఒమెన్‌లో జరిగిన ఒక చారిత్రాత్మక ప్రసంగంలో, కృష్ణమూర్తి అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తూ ఆ సంస్థను రద్దు చేశారు.ఆ ప్రసంగంలో ఆయన చేసిన ప్రకటన ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలోనే ఒక మైలురాయి ,సత్యం ఒక మార్గం లేని దేశం (ుతీబ్ష్ర అం ఖ జూథ్ష్రశ్రీవంం శ్రీఖఅఏ). మీరు దానిని ఏ మతం, ఏ సంప్రదాయం ద్వారా చేరుకోలేరు.తనకు కట్టబెట్టిన గురువు హోదాను, అధికారాన్ని తృణప్రాయంగా వదిలేశారు. మీరు మీకు మీరే గురువు కావాలి. మీ మనస్సు నుండే సత్యాన్వేషణ మొదలవ్వాలి అని చాటిచెప్పారు. అధికారం, అనుసరణ, మతం ఇవన్నీ మనిషిని సంకెళ్ళలో బంధిస్తాయని ఆయన వాదించారు. నిజమైన స్వేచ్ఛ కేవలం ఆంతరిక మేల్కొలుపు ద్వారా మాత్రమే లభిస్తుందని ఆయన తన జీవితం ద్వారా నిరూపించారు. స్వేచ్ఛ అనే పదాన్ని వింటే చాలామందికి బయటి అడ్డంకుల నుండి విముక్తి మాత్రమే గుర్తొస్తుంది. జైలు నుండి బయటపడటం, నియమాల నుండి తప్పించుకోవడం లేదా సామాజిక ఒత్తిళ్ళ నుండి వేరుపడటాన్ని మనం స్వేచ్ఛ అనుకుంటాం. కానీ కృష్ణమూర్తి దృష్టిలో అది కేవలం ప్రతిచర్య' (Reaction) మాత్రమే, అది నిజమైన స్వేచ్ఛ కాదు. ఆయన అభిప్రాయంలో నిజమైన స్వేచ్ఛ అంటే మన స్వంత భయాల నుండి, పక్షపాతాల నుండి, ముందే ఏర్పడిన అభిప్రాయాల నుండి విముక్తి పొందడం. మనం పసిపిల్లలుగా ఉన్నప్పటి నుండే ఒక నిర్దిష్ట మత విశ్వాసం, జాతీయ అభిమానం, కుటుంబ సంప్రదాయం ఇవన్నీ మన మనస్సులో లోతుగా నాటుకుపోతాయి. మనం ప్రపంచాన్ని ఈ ముసుగుల ద్వారానే చూస్తాం. ఈ కండిషనింగ్ (Conditioning) అంటే మన మనస్సు ముందే ఏర్పాటు చేసుకున్న అచ్చులు మన అవగాహనకు అతిపెద్ద అడ్డంకి అని కృష్ణమూర్తి స్పష్టంగా చెప్పారు. మీరు మీ ఆలోచన కాదు. మీరు మీ భావన కాదు. మీరు ఆ అన్నింటికీ అతీతమైన స్పృహ అని ఆయన ప్రబోధించారు. కండిషన్డ్ మైండ్ ఎప్పుడూ గతం తోనే జీవిస్తుంది, అది జీవితాన్ని తాజాగా అనుభవించలేదు. స్వేచ్ఛ అంటే ఈ పాత అచ్చుల నుండి విముక్తి పొందడం. అది ఒక్కసారిగా జరిగే మ్యాజిక్ కాదు, అది ప్రతి క్షణమూ చేసే ఆంతరిక నిరీక్షణ. కృష్ణమూర్తి తత్వంలో అవగాహన (Awareness) అనేది అత్యంత కీలకమైన అంశం. ఆయన దృష్టిలో జ్ఞానం వేరు, అవగాహన వేరు. జ్ఞానం అనేది పుస్తకాల ద్వారా, గతం ద్వారా వచ్చే సమాచారం. అవగాహన మాత్రం సజీవంగా ఉంటుంది, ప్రతి క్షణంలో కొత్తగా ఉంటుంది. మన సమస్యలు చాలావరకు వాటిని అర్థం చేసుకోకుండా పరిష్కరించాలని ప్రయత్నించడం వల్లే



పెరుగుతాయని ఆయన విశ్లేషించారు. ఉదాహరణకు, భయాన్ని అర్థం చేసుకోకుండా దానిని అణచివేయాలని చూస్తాం. కానీ కృష్ణమూర్తి మాటల్లో మీరు దేనితోనైతే పోరాడతారో, దానితో మీరు ఒక్కటవుతారు. దేనినైతే అర్థం చేసుకుంటారో, అది మిమ్మల్ని విడిచిపోతుంది.నిజమైన అవగాహన అంటే తీర్పు ఇవ్వకుండా చూడడం (Choiceless Awareness). మనం ఏదైనా చూసినప్పుడు వెంటనే ఇది మంచిది, ఇది చెడు అని వర్గీకరిస్తాం. ఈ వర్గీకరణే మన చూపును మసకబారుస్తుంది. ఒక అద్దం వలె, ఏ విధమైన పక్షపాతం లేకుండా మన మనస్సులోని ఆలోచనలను మనం గమనించగలిగితే, అక్కడే మార్పు మొదలవుతుంది. కృష్ణమూర్తి మానవ సంబంధాలను ఒక దర్పణంలా చూపించారు. మనం ప్రేమ అని పిలిచేది నిజానికి మన ఒంటరితనం నుండి తప్పించుకోవడానికి చేసే ప్రయత్నమా? అని ఆయన ప్రశ్నించారు. చాలా సంబంధాలు పరస్పర అవసరాల మీద, భయం మీద ఆధారపడి ఉంటాయని ఆయన వాదించారు. నిజమైన ప్రేమ అనేది నాది అని క్లెయిమ్ చేయదు. అది అహంకారం లేని మనస్సులో మాత్రమే ఉద్భవిస్తుంది. స్వార్థపూరిత మనసు ప్రేమను పోలిన ఏదైనా ఉత్పత్తి చేయగలదు, కానీ నిజమైన ప్రేమను కాదు అని ఆయన కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. సంబంధం అనేది మనల్ని మనం అర్థం చేసుకోవడానికి ఒక గొప్ప అవకాశం. ఎదుటి వ్యక్తిని ఒక అద్దంలా చూసుకున్నప్పుడు మనలోని రాగద్వేషాలు మనకే స్పష్టంగా కనిపిస్తాయి. కృష్ణమూర్తి దృష్టిలో ఆలోచన అనేది ఎప్పుడూ గతానికి చెందినది. అది పాత స్మృతుల ఆధారంగా పనిచేస్తుంది కాబట్టి అది ఎప్పటికీ కొత్తదనాన్ని సృష్టించలేదు. అలాగే, రేపు నేను మారతాను అనే ఆలోచనే ఒక భ్రమ అని ఆయన హెచ్చరించారు. పరివర్తన అనేది కాలక్రమేణా జరిగేది కాదు, అది ఈ క్షణంలో జరిగే సత్యావగాహన. మరణాన్ని గురించి కూడా ఆయన అత్యంత సహజంగా మాట్లాడారు. మరణం అంటే కేవలం శరీరం ముగిసిపోవడం కాదు, ప్రతి క్షణం మన పాత అస్తిత్వాన్ని, పాత స్మృతులను వదిలేయడమే అసలైన మరణం. అలా చనిపోగలిగిన వాడే ప్రతి క్షణం కొత్తగా జీవించగలడు. నేటి సోషల్ మీడియా యుగంలో, సమాచార అతిభారంతో సతమతమవుతున్న మనకు కృష్ణమూర్తి బోధనలు ఒక దిక్సూచి వంటివి. ప్రతి వ్యక్తీ ఇతరుల లైకులు, కామెంట్ల కోసం, సమాజం మెప్పు కోసం తాపత్రయపడుతున్న ఈ రోజుల్లో, మీ లోపలికి మీరు చూసుకోండి అనే ఆయన పిలుపు ఎంతో శక్తివంతమైనది. ఫేక్ న్యూస్ మరియు కృత్రిమ మేధస్సు కాలంలో, దేనినీ గుడ్డిగా నమ్మకుండా, స్వయంగా విచారించి సత్యాన్ని తెలుసుకోవాలనే ఆయన సందేశం అత్యంత ప్రాసంగికం. కృష్ణమూర్తి స్థాపించిన రిషి వ్యాలీ వంటి పాఠశాలలు కేవలం మార్కుల కోసం కాకుండా, విద్యార్థుల్లో సమగ్రమైన అవగాహనను పెంపొందించడానికి కృషి చేస్తున్నాయి. నిజమైన విద్య అంటే పరీక్షలలో నెగ్గడం కాదు, అది జీవితాన్ని అర్థం చేసుకోవడం అని ఆయన నమ్మేవారు. తెలుగు నేల మీద పుట్టి, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఆలోచనా ధోరణిని మార్చిన కృష్ణమూర్తి మనందరికీ గర్వకారణం. శంకరాచార్యులు, రమణ మహర్షి వంటి మహనీయుల వరుసలో ఆయన నిలుస్తారు, కానీ ఆయన పద్ధతి ప్రత్యేకం. ఆయన మనకు ఏ మంత్రాన్ని ఇవ్వలేదు, కేవలం మనల్ని మనం ప్రశ్నించుకునేలా చేశారు. జిడ్డు కృష్ణమూర్తి తత్వం చదవడానికి సులభంగా అనిపించినా, ఆచరించడం ఒక నిరంతర సవాలు. ఎందుకంటే ఆయన మనల్ని బయటి గురువులను వదిలేసి, మన లోపలి చీకటిని మనమే చూసుకోమంటారు. 1986 ఫిబ్రవరి 17న ఆయన కాలిఫోర్నియాలో తుది శ్వాస విడిచారు. ఆయన వెళ్ళిపోతూ తన వెనుక ఏ మతాన్నీ, ఏ గుడినీ వదిలి వెళ్ళలేదు. కేవలం ఒక జీవించే ప్రశ్నను వదిలివెళ్ళారు మీరు నిజంగా స్వేచ్ఛగా ఉన్నారా? ఆయన బోధనల సారాంశం ఒక్కటే సత్యం మీ బయట ఎక్కడో లేదు, అది మీ అవగాహనలోనే ఉంది. సత్యం మార్గంలేని ఒక నేల అన్న ఆయన మాటలను గుర్తుంచుకుంటూ, మన లోపలికి మనం ప్రయాణించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి. ఆ ప్రయాణమే మనల్ని భయం నుండి విముక్తుల్ని చేసి, నిజమైన శాంతిని ప్రసాదిస్తుంది.

# అర్హులైన ప్రతి లబ్ధిదారుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలి

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**







**మహబూబాబాద్ వెలుతురు మార్చి 06:**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై మహబూబాబాద్ ఐడీఓసి కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, శాసన సభ్యులు మురళి నాయక్, దొంతి మాధవరెడ్డి, రాజేందర్ రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కూడా చైర్మన్ ఇనుగల వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నెల 6వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా మరియు వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను తీర్చాలని, అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని చెప్పారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి కొరత ఉండకుండా చూడాలని సూచించారు. ఉపయోగంలో లేని వైద్య పరికరాలను తొలగించి, అవసరమైన పరికరాలకు తగిన సిబ్బందిని నియమించి వాటిని సమర్థంగా వినియోగంలోకి తేవాలని పేర్కొన్నారు. పాఠశాలల వాహనాలు ఫిట్ నెస్ లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిపిఆర్ఎస్ ద్వారా పాఠశాల వాహనాలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. స్లమ్ ఏరియాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ఉందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి, ఎక్కడైనా నిధులు మంజూరు సమస్య ఉంటే నివేదికలు పంపాలని తెలిపారు. ప్రతి హస్టల్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించి తనిఖీలు చేయాలని, విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో ప్రభుత్వం ద్వారా లబ్ది పొందిన లబ్ధిదారుల జాభితా తయారు చేయాలని తెలిపారు. మార్చి నెలాఖరు వరకు ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, గ్రౌండ్ కాని ఇండ్లు లబ్ధిదారుల నుండి అంగీకారాన్ని తీసుకుని రద్దు చేయాలని తెలిపారు. అనర్హులకు ఇండ్లు ఇస్తే కలెక్టర్లు భాద్యులు అవుతారని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో పాత ఇల్లు ఉన్న ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చెస్తే ఆటంకాలు కలిగించొద్దని అటవీ అధికారులను ఆదేశించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార స్థితిని దరఖాస్తుదారులు తెలుసుకునేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి సమాచారం వారి సెల్‌ఫోన్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల వసతి గృహాల్లో ఇన్సినిరేటర్లు ఏర్పాటు చేయాలని, మండల స్థాయిలో ఆరోగ్య సదస్సులు నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఛైర్మన్‌లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అటవీ, రెవెన్యూ భూ సమస్య పరిష్కారానికి సంయుక్తంగా సర్వే నిర్వహించి హద్దులు వేయాలని తెలిపారు. ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలలో సమస్య బాగా ఉందని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న పాత రహదారుల అభివృద్ధికి ఆటంకాలను కలిగించొద్దని స్పష్టం చేశారు. భూ భారతిలో ఇచ్చిన పట్టాలు, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. భూ భారతిలో అక్రమాలు జరిగితే సహించేది లేదని తెలిపారు. కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ పెట్టొద్దని, రోడ్లు, కెనాల్, ఇతర అభివృద్ధి పనులకు భూ సేకరణ పూర్తి చేయాలని తెలిపారు. వినియోగంలో లేని పాత భవనాలను తొలగించాలని, ముక్యంగా పాఠశాలలు తొలగించి నూతన భవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. వినియోగంలో ఉన్న భవనాలకు రంగులు వేయాలని తెలిపారు. వినియోగంలో లేని పాత భవనాలను తొలగించాలని, ముఖ్యంగా పాఠశాలలు తొలగించి నూతన భవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. వినియోగంలో ఉన్న భవనాలకు రంగులు వేయాలని తెలిపారు. అర్హులైన మహిళలను మహిళ సంఘాలలో సభ్యులుగా చేర్చాలని తెలి పారు. మహిళల పథకాలకు సంబంధించి అన్ని పథకాలు ఈ 99 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో ఒక్కో ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని, స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని ప్రతిపాదనలు ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానికి వచ్చిన మహిళకు హెచ్ ఐ వి పాజిటివ్ ఉంటే నెగిటివ్ అని తప్పుడు ధ్రువీకరణ ఇచ్చారని మహబూబాద్ శాసన సభ్యులు మురళి నాయక్ చేసిన ఫిర్యాదుపై తక్షణమే విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కు సూచించారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరిన్టెండెంట్ సమావేశానికి గైర్హాజరు కావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఛార్జ్ మెమో జారీ చేయాలని మంత్రి పొంగులేటి కలెక్టర్ కు సూచించారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం.. ఈ యుద్ధం ముగిసేదెలా ?



పశ్చిమాసియా యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. దీనికితోడు ఇది మూడో ప్రపంచ యుద్ధంగా మారబోతుందా అన్న భయాలు వెల్లడవుతున్నాయి. ఎందుకంటే ఇజ్రాయిల్, అమెరికాల దూకుడు తగ్గడం లేదు. ప్రతిగా ఇరాన్ కూడా విధ్వంసం సృష్టిస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఇరాన్‌ను అమెరికా తక్కువ అంచనా వేసినట్లుగా అర్థం అవుతోంది. మరోవైపు యుద్ధాన్ని ఆపాలని చైనా, రష్యాలు రంగంలోకి దిగాయి. ఇరాన్‌కు ఈ రెండు దేశాలు మద్దతు ప్రకటించాయి. దీంతో ఏంజరగబోతుందో అన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది.తాజాగా చైనా నోరు విప్పడంతో ఈ యుద్ధం కీలకమైన మలుపు తీసుకునే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఇరాన్‌లో రహస్యంగా కొనసాగుతున్న న్యూక్లియర్ రియాక్టర్ ఏ మాత్రం లీక్ అయినా, ఇరాన్, పరిసర ప్రాంతాల్లో ఉన్న దేశాలకు కూడా ముప్పు ముంచుకొస్తుంది. దీనిపై ఇటు ఇరాన్‌కు అటు అమెరికాకు కూడా అవగాహన ఉండివుంటుది. కానీ ఎందుకో ఇరాన్ కూడా తమ దాడుల తీవ్రత పెంచింది.ఈ యుద్ధంతో ఇప్పటికే మధ్య ప్రాచ్యం మండిపోతోంది. ఇరాన్ సార్వభౌమత్వాన్ని కాపాడతామంటూ చైనా రంగంలోకి దిగడంతో ప్రపంచ దేశాల్లో మూడో ప్రపంచ యుద్ధ భయాలు కనపడుతున్నాయి. ఇదే సమయం లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరిన్న భీకర దాడుల్ని చేసేందుకు సిద్ధమౌతున్నట్లు ప్రకటించారు. యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదని ట్రంప్ ముందే హెచ్చరించారు. ఆ వెనువెంటనే యుద్ధ తీవ్రత ఎలా ఉంటుందో కూడా చెప్పనే చెప్పారు. ఎనిమిది అరబ్దేశాలు ఇరాన్ దాడులతో విలవిల్లాడు తున్నాయి. ఇరాన్ అమెరికాతో రాజీ చర్చల కోసం ఏవిధంగానూ ప్రయ త్నించడం లేదు. మరోవైపు హర్మూజ్ జలసంధి మూసివేయడంతో ప్రపంచం మీద చమురు భారం పడుతోంది. సంక్షోభం తప్పేలా లేదు. అమెరికా మాత్రం చర్చలకు ఆలస్యం అయ్యిందని బెదిరిస్తోంది. ఇరాన్‌లో తదుపరి ఎవరు నేతగా ఉండాలో తామే నిర్ణయిస్తామని కూడా ట్రంప్ ప్రకటించాడు. ఇకపోతే ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలు ముప్పు ముంగిట ఉన్నాయి. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం,రిఫైనపై ఇరాన్ దాడి చేయడంతో చమురు సరఫరా ఆగిపోయింది. ఇరాన్ తన హోర్ముజ్ జలసంధిని మూసి వేస్తే ప్రపంచ దేశాలకు అందే చమురు సరఫరా ఆగిపోగలదని అనుభవంఓలకి వచ్చింది. ఈ క్రమంలో బహ్రెయిన్ పోర్టులో ఆగి ఉన్న అమెరికాకు చెందిన స్టెనా ఇంపరేటివ్ చమురు నౌక పైనా డ్రోన్ దాడులు జరిగి మంటలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా అమెరికా తదితర దేశాల చమురు నౌకలు దెబ్బతింటే ఆయా దేశాలు ఇక చమురుకు కష్టాలు పడాల్సిందే. ఒకవైపు అమెరికా యుద్ధనౌకల మోహరింపు. మరోవైపు ఇరాన్, రష్యా యుద్ధ నౌకలు సంయుక్త నావికాదళ విన్యాసాల కవ్వింపుతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. యుద్ధ జ్వాలలు మింటికెగయడంతో భారత్ దేశంతో సహా ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు, పప్పు ధాన్యాలు, నూనెల ధరలపై విపరీతమైన ప్రభావం పడుతోంది. ఇప్పటికే దక్షిణ కొరియా, జపాన్, చైనా స్టాక్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. తాజా పరిస్థితుల రీత్యా యుద్ధ సంకేతాలు విస్తరించి ఆయా దేశాలు ఏదో ఓ పక్కకు చేరిపోవడం ఒక్కటే ప్రత్యామ్నాయంగా ఉన్నందున యుద్ధం మరికొంతకాలం తమ ప్రతాపాలను చూపిస్తుంది. యుద్ధం ఆగినా యుద్ధకాలపు ప్రభావాలు అంతత్వరగా ఉపసంహరణ జరుగదు. ఆ తర్వాత కూడా మార్కెట్లు కోలుకోవడానికి, పెరిగిన ధరలు తగ్గడానికి మరెంతో కాలం పడుతుంది. ఎందుకంటే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసేలా లేదు. ఇరువైపులా భీకర యుద్ధమే సాగుతోంది. ఎవరూ తగ్గేటట్లు లేరు. నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేసాయి. ఈ దాడిలో ఏమరుపాటున ఆ అణుకేంద్రం నుంచి వెలువడే అణుధార్మికత ప్రమాదకరమే. ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అమెరికా అధినేత ట్రంప్ ప్రయత్నిస్తున్న తరుణంలో చైనా ఇరాన్‌తో చేయికల్పడం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనని సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రష్యా కూడా రంగంలోకి దిగితే ఇక అది ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చు. మరోవైపు ఉక్రెయిన్ కూడా ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాతో చేతులు కలిపింది. ఇది సహజంగానే రష్యాకు గిట్టదు. మొత్తంగా ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా ఏర్పడితే వినాశనం తప్పదు. ప్రజలు ఆకలిచావులకు లోను కావాల్సిందే. ఈ క్రమంలో యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నాలు సాగాలి. ఇరు దేశాల మధ్య ఇగోలను చల్లార్చాలి. ఈ దశలో ఎవరు ముందుకు వస్తారన్నదే ముఖ్యం.

## యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం

- అసలు యుద్ధం మొదలయ్యిందే ఇప్పుడు
- అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టం



**వాషింగ్టన్,మార్చి6( వెలుతురు):**
ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం నుంచి వెనక్కి తగ్గేదే లేదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం చేశారు. అమెరికా సైనిక శక్తిని ఇరాన్ తక్కువ అంచనా వేస్తోందన్నారు. ఈ యుద్ధంలో అమెరికా నిలబడలేదని ఇరాన్ అనుకుంటోందని, తాము అసలు పోరాటాన్ని ఇప్పుడే మొదలుపెట్టామని ఆయన పేర్కొన్నారు. ఇక గల్ఫ్ ప్రాంత సముద్ర జలాల్లో అమెరికా నౌకా దళాలు వెనక్కి జరుగుతున్నాయనే ప్రచారాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఖండించింది. యావత్ ఇరాన్ నేవీని సముద్రంలో ముంచేసే వరకు తమ మిషన్ ఆగదని తేల్చి చెప్పింది. గత 72 గంటల్లో ఇరాన్‌లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్ ఫోర్స్ వైమానిక దాడులు చేసిందని సెంట్‌కామ్ వెల్లడించింది. బి-2 స్పిరిట్ బాంబర్ విమానాల నుంచి కేవలం ఒక గంట వ్యవధిలోనే 2వేల పౌండ్ల బరువున్న డజన్ల కొద్దీ పెనెట్రేటర్ బాంబులను బాలిస్టిక్ మిస్సైల్ లాంచ్ ప్యాడ్లపై వేశామని పేర్కొంది. అమెరికా సంకల్పం ఎంత బలమైందో ఇరాన్ అర్థం చేసుకోలేకపోతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ అన్నారు. ఇరాన్‌పై తమ సైనిక చర్యను బలంగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. వాషింగ్టన్‌లో విలేకరుల సమావేశం వేదికగా పీట్ హెగ్సెథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాను ఇరాన్ నేతలు, ఐఆర్‌జీసీ తక్కువ అంచనా వేస్తున్నాయని ఆయన చెప్పారు. తమ సంకల్పానికి కట్టుబడి ఉంటామని, ఇరాన్‌పై పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. పూర్తి శక్తితో అమెరికా ఇప్పుడే దాడులను మొదలుపెట్టిందన్నారు. ఒకవేళ అవసరమైతే దీర్ఘకాలం పాటు ఈ యుద్ధాన్ని చేసేందుకూ అమెరికా సన్నద్ధమై ఉందని పేర్కొన్నారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో అరబ్ దేశాల నుంచి అమెరికాకు శరణార్ధులు క్యూ కట్టే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే అరబ్ శరణార్ధులకు అమెరికాలో ఆశ్రయాన్ని కల్పించే ఎలాంటి ప్రణాళికలూ ప్రస్తుతానికి తమకు లేవని అమెరికా రక్షణ మంత్రి తేల్చి చెప్పారు.

## పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

**- 200 మంది వరకు చనిపోయినట్లు యూనిసెఫ్ ప్రకటన**

**న్యూఢిల్లీ,మార్చి6( వెలుతురు):**



అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మూల్యం మాత్రం చెల్లిస్తున్నారు అని వ్యాఖ్యానించింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇదిలాఉండగా.. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు ఆపరేషన్‌లో ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ఓ బాలికల పాఠశాలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 160 మందికి పైగా విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది. ఈ దాడిపై తాజాగా యూఎస్ దళాలు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ అధికారులు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

## విశ్వనగరం అంటారు.. దోమల నుంచి రక్షణ కూడా ఇవ్వలేరా?



**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

*"విశ్వనగరం" అనే పదం కేవలం ప్రకటనల కోసం ఉపయోగించే అలంకార పదం కాదు. అది ఒక నగరపు జీవన ప్రమాణాల ప్రమాణపత్రం. ఒక నగరం నిజంగా విశ్వనగరంగా నిలవాలంటే, అక్కడి సాధారణ పౌరుడు భయంలేకుండా, ఇబ్బందులేకుండా, కనీస సౌకర్యాలతో జీవించగలగాలి. రాత్రి ప్రశాంతంగా నిద్రపోవడం కూడా ఒక మానవ హక్కు. హైదరాబాద్‌ను "విశ్వనగరం"గా తీర్చిదిద్దామని (+ఎవీజ) మరియు రాష్ట్ర పాలకులు పలుమార్లు ప్రకటించారు. హైటెక్ భవనాలు, ఫ్లైఓవర్లు, ఐటీ టవర్లు, అంతర్జాతీయ ఈవెంట్లు, ఇవన్నీ నగర అభివృద్ధి సూచికలుగా చూపిస్తారు. కానీ అదే సమయంలో కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, నిల్వ నీరు, సరైన డ్రైనేజీ లేకపోవడం వల్ల దోమల పెరుగుదల ఒక తీవ్రమైన ప్రజా ఆరోగ్య సమస్యగా మారింది.*

దోమల సమస్య అనేది కేవలం అసౌకర్యం మాత్రమే కాదు; అది ఆరోగ్య ప్రమాదం కూడా. డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రతి ఏడాది వర్షాకాలంలో పెరుగుతుంటాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ , (ఔనూ) కూడా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను ప్రపంచవ్యాప్తంగా ప్రధాన ప్రజా ఆరోగ్య సవాలుగా పేర్కొంటోంది. ఒక విశ్వనగరంలో నివసించే ప్రజలు ఈ రిస్క్‌ను రోజూ ఎదుర్కొనాల్సి వస్తే, అభివృద్ధి ఎక్కడ?

డిజిటల్ ప్రచారాలు, ఎక్స్ పోస్టులు, ప్రకటనలు, ఇవి ప్రజల దృష్టిని ఆకర్షించవచ్చు. కానీ నేలమీద పరిస్థితి మారకపోతే ఆ ప్రచారం ఖాళీ శబ్దంగా మారిపోతుంది. రాత్రిళ్లు తలుపులు మూసుకుని, దోమల బ్యాట్ చేతిలో పట్టుకుని, చెమటలతో తడిసి నిద్రపోయే పౌరుడుఅతడే అసలు నగర అభివృద్ధికి ప్రమాణం.

విశ్వనగరానికి మూడు ముఖ్యమైన ప్రమాణాలు ఉండాలి అందులో భాగంగా,ప్రాథమిక సౌకర్యాలు శుభ్రమైన వీధులు, సమర్థవంతమైన డ్రైనేజీ, చెత్త నిర్వహణ.ప్రజా ఆరోగ్యం నిరంతర ఫాగింగ్, దోమల నియంత్రణ చర్యలు, అవగాహన కార్యక్రమాలు.ప్రజా భాగస్వామ్యం కాలనీ స్థాయిలో ఫిర్యాదులను వేగంగా పరిష్కరించే వ్యవస్థ.అభివృద్ధి అంటే కేవలం స్కైస్క్రేపర్లు కాదు, ప్రజల జీవన నాణ్యత. ఒక పేదవాడు అయినా, మధ్యతరగతి ఉద్యోగి అయినాఅతడికి రాత్రి ప్రశాంతంగా నిద్రపోయే హక్కు ఉండాలి. ఆ హక్కును కాపాడలేకపోతే "విశ్వనగరం" అనే బిరుదు ఒక అలంకార పదంగా మాత్రమే మిగిలిపోతుంది.

నగర పాలకులు నిజంగా విశ్వనగరంగా నిలవాలనుకుంటే, ముందుగా కాలనీల్లో దోమల సమస్యను సమూలంగా పరిష్కరించాలి. ఫాగింగ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించడం, నిల్వ నీటిని తొలగించడం, పౌరుల ఫిర్యాదులకు స్పందించడంఇవి సాధారణ చర్యలే. కానీ ఇవే ప్రజల విశ్వాసాన్ని పెంచుతాయి.

అంతర్జాతీయ ప్రమాణాలు అనేవి పెద్ద ప్రాజెక్టులతో కాదు, చిన్న సమస్యల పరిష్కారంతో ప్రారంభమవుతాయి. ఒక సాధారణ పౌరుడు రాత్రి ప్రశాంతంగా నిద్రపోయే రోజేఆ రోజు నిజంగా నగరం "విశ్వనగరం" అవుతుంది. ఇక

ఈ మహానగరం అంటే హైదరాబాద్. దేశంలో ఐటీ రంగంలో ముందంజలో ఉందని చెప్పుకునే నగరం. ప్రపంచస్థాయి కంపెనీలు, ఫ్లైఓవర్లు, స్కైవేలు, రింగ్ రోడ్లు, మెట్రో రైళ్లు ఉన్నాయని గర్వపడే నగరం. కానీ అదే నగరంలో ఒక దోమను కూడా పారదోలలేని పరిస్థితి ఏర్పడితే ఆ అభివృద్ధి అద్దంలా పగిలిపోదా?దోమల సమస్య కొత్తది కాదు. కానీ ఈసారి అది తీవ్రమైంది. యాకత్పురా, ఫలక్నామా,అంబర్‌పేట్, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్, రామంతాపూర్, నాగోల్, కుషాయిగూడ, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లిడ అలాగే సికింద్రాబాద్ జోన్‌లోని మల్కాజిగిరి, మేడిపల్లి, తార్నాకడ ఏ జోన్‌కి వెళ్లినా ఒకే మాట వినిపిస్తోంది "దోమలతో బతుకు బోరు అయిపోయింది."

ఒకప్పుడు బిఆర్ఎస్ ప్రభుత్వంలో (జీహెచ్ఎంసీ)లో ఎంటమాలజీ విభాగం ఎంతో చురుకుగా పనిచేసేది. ఏటా సర్వేలు నిర్వహించి, డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదైన ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించేవారు. లార్వా పెరుగుతున్న నీటి నిల్వలు ఎక్కడున్నాయో గుర్తించి చర్యలు తీసుకునేవారు. 4,850 కాలనీలను పర్యవేక్షిస్తూ దోమల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసేవారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ చురుకుదనం ఎక్కడ? ఈసారి అలాంటి సమగ్ర కార్యక్రమాలు కనిపించడం లేదు.

అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే దోమల నివారణకు కీలకమైన చీఫ్ ఎంటమాలజిస్ట్ పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది అని అధికార వర్గాలు తెలియజేస్తున్నాయి . నాయకత్వం లేకుండా ఏ విభాగం ఎలా పనిచేస్తుంది? యాక్షన్ ప్లాన్ ఎవరు సిద్ధం చేస్తారు? సమన్వయం ఎవరు చూస్తారు? ఫీల్డ్ సిబ్బందిని ఎవరు పర్యవేక్షిస్తారు? ఒక కీలక పోస్టును ఖాళీగా ఉంచి దోమలపై యుద్ధం చేస్తామనడం కేవలం మాటల ఆట కాదా?

గతంలో వర్షాలు అతలాకుతలం చేశాయి, ఈసారి పరిస్థితిని క్లిష్టం వచ్చే పరిస్థితులు ఉంటాయి కాబట్టి ముందుచూపుగా ప్రభుత్వం పనులు చేయాల్సిన అవసరం ఉంది . ఇక భారీ వర్షాలు పడితే నీటిలో లార్వా కొట్టుకుపోతుంది. కానీ చిన్నపాటి వానలు, ఆ తర్వాత ఎండలు ఇవి దోమల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు. ఏప్రిల్, మే జూన్ .జూలై, ఆగస్టు నెలల్లో సాధారణంగా డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదవుతాయని ప్రతి సంవత్సరం అనుభవం చెబుతోంది. అయినా ముందస్తు చర్యలు కనిపించకపోతే ప్రజలు భయపడి పోతారు కదా?

ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్లు ఇవి కేవలం పుస్తకాల మాటలుగా మారిపోయాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఫాగింగ్ చేయాలని ఆదేశాలు ఉన్నా, ఫీల్డ్‌లో అవి అమలు కావడం లేదని స్థానికులు చెబుతున్నారు. కొన్ని కాలనీల్లో నెలల తరబడి ఫాగింగ్ యంత్రం కనిపించలేదని ప్రజలు వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో బిఆర్ఎస్ దోమల నియంత్రణ కోసం రూ.21 కోట్లు కేటాయించారు. 150 డివిజన్లలో 2,375 మంది సిబ్బంది, పనిచేయించారు. వీరిలో 1,800 మంది ఫీల్డ్‌లో తిరిగి ఫాగింగ్ చేయాల్సి ఉంది. 1,817 ఫాగింగ్ మెషీన్లు,గతంలో ఉన్నాయని ప్రభుత్వ అధికారులు తెలియజేశారు,

కానీ వాస్తవం ఏమిటి? సగం యంత్రాలు పనిచేయడం లేదని వర్కర్లు చెబుతున్నారు. పాత మెషీన్లు, రిపేర్లు కష్టమని వివరణలు వినిపిస్తున్నాయి.ఇది కేవలం యంత్రాల సమస్యేనా? లేక వ్యవస్థలో లోపాలా? కొందరు ఎంటమాలజీ ఎస్‌ఈలు, సూపర్‌వైజర్లు రికార్డుల్లో అన్ని యంత్రాలు పనిచేస్తున్నట్లు చూపించి డీజిల్ నొక్కేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్స్‌లో పోస్టులు పెడుతూ "బ్రహ్మాండంగా ఫాగింగ్ చేస్తున్నాం" అని చెప్పడం సులభం. కానీ ఒక బస్తీలో రాత్రి 9 గంటలకు వెళ్లి ప్రజల్ని అడిగితే నిజం బయటపడుతోంది.చెరువుల్లో లార్వా నియంత్రణకు డ్రోన్ల ద్వారా స్ప్రే చేస్తున్నామని చెబుతున్నారు. కానీ స్థానికులు "మా చెరువులో ఎప్పుడూ డ్రోన్ కనిపించలేదు" అంటున్నారు. ఇది ప్రచారమా? లేక వాస్తవమా? ప్రజలు అడిగే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం రావాలి.

డీజిల్, పెట్రోల్ మాయం చేస్తున్నారనే ఆరోపణలు మరింత తీవ్రమైనవి. పెద్ద మెషీన్లకు రోజూ కనీసం 45 లీటర్ల డీజిల్, 5 లీటర్ల పెట్రోల్ అవసరం. చిన్న మెషీన్లకు తొమ్మిదిన్నర లీటర్ల డీజిల్, లీటరున్నర పెట్రోల్ కావాలి. కానీ ఫీల్డ్‌లో సగం యంత్రాలే తిరుగుతున్నాయంటే మిగతా ఇంధనం ఎక్కడికి వెళ్తోంది? ఇది ప్రజల టాక్స్ కట్టిన డబ్బు కాదా? గతంలో అల్వాల్ సర్కిల్‌లో ఎనిమిది చిన్న మెషీన్లు ఉన్నా, ఫీల్డ్‌లో నాలుగే కనిపిస్తున్నాయట. కానీ రికార్డుల్లో ఎనిమిది మెషీన్ల డీజిల్ వినియోగం చూపుతున్నారట. ఇది ఒక సర్కిల్‌లో పరిస్థితి అయితే మిగతా సర్కిళ్లలో పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు.

బల్దియా కమిషనర్ డీజిల్, పెట్రోల్ కూపన్లకు బదులుగా కార్డు సిస్టమ్ తీసుకురావాలని నిర్ణయించారు. కానీ అది ఇంకా అమల్లోకి రాలేదు. అప్పటివరకు దందా కొనసాగుతూనే ఉందని విమర్శలు వస్తున్నాయి. నిర్ణయాలు తీసుకోవడం ఒకటే, వాటిని అమలు చేయడం మరోటి.

ఇక ప్రజల పరిస్థితి? చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు వీరే ఎక్కువగా బాధపడుతున్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్గున్యా వంటి రోగాలు ప్రాణాంతకమవుతాయి. ఒక కుటుంబంలో ఒకరు అనారోగ్యానికి గురైతే ప్రైవేటు ఆసుపత్రి ఖర్చులు మితిమీరిపోతాయి, పని దినాల నష్టం, మానసిక ఒత్తిడి ఇవన్నీ కలిపి ఒక పెద్ద భారంగా మారుతున్నాయి.

ప్రజలు అడిగేది ఏమిటి? ఫ్లైఓవర్ కాదు. మెగా ప్రాజెక్టు కాదు. కనీసం రాత్రి ప్రశాంతంగా నిద్రపోయే హక్కు కావాలి. దోమల బెడద లేకుండా జీవించే హక్కు కావాలి. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అడిగిన కోరిక కాదు ఇది మౌలిక హక్కు.విశ్వనగరం అనాలంటే కేవలం భవనాల ఎత్తు సరిపోదు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత, సమర్థవంతమైన మున్సిపల్ సేవలు ఇవే అసలు ప్రమాణాలు. ఎంటమాలజీ విభాగంలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి. యంత్రాలు పనిచేయకపోతే వెంటనే రిపేర్ చేయాలి లేదా కొత్తవి కొనాలి. ఫీల్డ్ సిబ్బందిపై కఠిన పర్యవేక్షణ ఉండాలి. ప్రతి డివిజన్‌లో ప్రతిరోజూ ఫాగింగ్ రిపోర్టులను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

డీజిల్ వినియోగంపై ఆన్‌లైన్ ట్రాకింగ్ సిస్టమ్ తీసుకురావాలి. డ్రోన్ల ద్వారా స్ప్రే చేస్తున్నామంటే లైవ్ ట్రాకింగ్ డేటా ప్రజలకు చూపాలి. మూసి పరివాహక ప్రాంతాలను తోపాటు కాలనీ వారీగా లార్వా సర్వేలు చేసి హాట్‌స్పాట్లను ప్రకటించాలి. స్థానిక కాలనీ అసోసియేషన్లతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం. ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. చెత్తను బయట వేయకూడదు. కానీ ఇది ప్రజల బాధ్యత మాత్రమే కాదు. వ్యవస్థ తన బాధ్యతను నిర్వర్తించాలి.

విశ్వనగరం అనే పదం ఒక ప్రచార నినాదం కాకూడదు. అది ఒక బాధ్యత. ఒక వాగ్దానం. ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలంటే ముందుగా దోమలపై యుద్ధం గెలవాలి. లేదంటే విశ్వనగరం అనే మాట ప్రజల చెవుల్లో వ్యంగ్యంగా మారిపోతుంది.

ప్రజలు వేడుకుంటున్నారు "మా ప్రాణాలు కాపాడండి మహాప్రభో!" ఈ అరుపు వినిపించకపోతే పాలన అర్థం ఏమిటి? దోమల సమస్యను తేలికగా తీసుకుంటే అది కేవలం ఒక చిన్న ఇబ్బంది కాదు అది ప్రజల ఆరోగ్యంపై, జీవన ప్రమాణాలపై, పాలన విశ్వసనీయతపై పెద్ద మచ్చ.

ఇప్పటికైనా కళ్లుచెదిరే ప్రకటనల కంటే కళ్లుచెదిరే దోమలపై దృష్టి పెట్టాలి. విశ్వనగరంగా నిలవాలంటే ముందుగా పౌరుల నిద్రను కాపాడాలి. లేదంటే విశ్వనగరం అనే పదం కాగితాలకే పరిమితమవుతుంది గల్లీల్లో, కాలనీలో మాత్రం దోమలే రాజ్యం చేస్తాయి అనేది నగ్న సత్యం.

# 70 మద్యం బాటిల్ లో పట్టివేత



**బషీర్బాగ్ వెలుతురు 6 మార్చి:** ఢిల్లీ గోవా నుంచి ఫ్లైట్స్ లో మద్యం బాటిల్లను తీసుకు వస్తున్నారని సమాచారం మేరకు ఎస్టిఎఫ్ ఏ టీం అంజిరెడ్డి సిబ్బంది కలిసి పహాడ్ షరీఫ్ వద్ద వచ్చే వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ వాహనాల తనిఖీల్లో 70 నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకున్నారు. ఈమద్యం పార్టీలను గోవా ఢిల్లీ ప్రాంతాల నుంచి వచ్చినట్లుగా గుర్తించారు. మద్యం బాటిలను మీర్పేట్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు

# జిహెచ్ఎంసి సిబ్బందికి వైద్య పరీక్షలు..



**బషీర్ బాగ్ వెలుతురు 6 మార్చి:** జిహెచ్ఎంసి గోషామహల్ సర్కిల్-30 పరిధిలోని ఫీల్ ఖాన్ లోని బేగంబజార్ వార్డు లో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ ఆదేశాల మేరకు బేగంబజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నీలేష్ జిహెచ్ఎంసి సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టమన్నారు. ఎండాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్రాగు నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. తమ ఏఎన్ఎం లు, ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నారని తెలిపారు. జిహెచ్ఎంసి సిబ్బందికి షుగర్, బిపి ఇతర రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి సర్కిల్-30 ఏ ఎం హెచ్ ఓ డాక్టర్ పి మధుసూదన్, ఠాగూర్ అనిల్ సింగ్, ఏఎన్ఎంలు సుజాత, నీలిమ, ఫార్మసిస్ట్ అంజలి, ఎల్ టి ప్రమోద్,ఎస్ఎఫ్ ఏ శంకర్, హెల్త్ అసిస్టెంట్ బాబురావు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ లో ప్రైవేట్ బిల్లు పెట్టాలి

### నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం అవకాశం కల్పించాలనీ ఏఐసీసీ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్ కి విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు మార్చి,, 06:** జనాభా దామాషా ప్రకారం బీసీలకు రావలసిన వాటా దక్కనీయకుండా రాష్ట్రంలో కొంతమంది అడ్డుపడుతున్నారని ఈ యొక్క విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఈరోజు ఏఐసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్ గారినీ కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్లో ప్రైవేట్ బిల్లు పెట్టాలని అంతేకాకుండా నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం అవకాశం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసినటువంటి బీసీలకు కాకుండా పార్టీలు మారి వచ్చిన అగ్రకులాలకు అగ్ర తాంబూలం కేటాయిస్తూ కార్పొరేషన్ చైర్మన్లు కేటాయిస్తున్నారని పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీని నమ్ముకున్న బీసీలకు మాత్రం మొండి చేయి చూపిస్తున్నారని ఎఐసిసి ఓబిసి డిపార్ట్మెంట్ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్ కు వివరించారు.


# ప్రతి కాలనీలో బస్తీ బాట

- ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి
- మల్లాపూర్ ఉమ్మడి డివిజన్ లో పరమేశ్వర్ రెడ్డి బస్తీబాట



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి/ఉప్పల్ (వెలుతురు న్యూస్ ):** ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లుగా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కాలనీలలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బస్తీబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లుగా చెప్పారు. కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ పరమేశ్వర రెడ్డి బస్తీబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మల్లాపూర్ ఉమ్మడి డివిజన్, శక్తిసాయి నగర్ డివిజన్ లలోని బ్రహ్మపురి కాలనీ, జన్నరం కాలనీ, చండియా నగర్, తదితర కాలనీలలో పర్యటించి నేరుగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తాగునీరు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక సమస్యలను పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తెచ్చారు. పై సమస్యలతో పాటు డ్రైనేజీ, రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. బస్తీలలో పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి బస్తీబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లుగా పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ ,మేడ్చల్ మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్, మాజీ కార్పొరేటర్ సింగి రెడ్డి ధన్ పాల్ రెడ్డి గారు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీత రామ్ రెడ్డి గారు,కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ , కిట్టు, బెల్లం గట్టియ్య , దంతురి రాజు కోయగూర బాలరాజ్ మక్తల బాలరాజ్ సురేష్ బెల్లం శ్రీను జెమిలా బేగం మధుసూదన్ రెడ్డి సద్గుణ జానీ భాయ్ పార్వతాలు శ్రీనివాస్ రాజేష్ శ్రీకాంత్ రెడ్డి ఫిరోజ్ శైలజ విజయ్ చారి ఉపేందర్ సాయి టిల్లు సాయి జయంత్ మని నాయకులు మరియు బ్రహ్మపూర్ణి కాలనీ జన్నరం నగర్ చెండియా నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు

## రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**కుత్బుల్లాపూర్ మార్చి 06 (వెలుతురు ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారులు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ కొలన్ హన్మంత్ రెడ్డి, అధికార ప్రతినిధి డీసీసీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వేం నరేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. వారి రాజకీయ ప్రయాణం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్ ముదిరాజ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోల సంజీవరెడ్డి, కేఎం గౌరీష్, బట్ట పాలకృష్ణ, గడ్డం రాజేందర్ రెడ్డి, మన్నే రాజు, లక్ష్మారెడ్డి, మైసిగారి శ్రీనివాస్, రషీద్, ఆలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుట్ల గ్రామంలో టమాట తోటను పరిశీలించిన

# ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్

- రైతులు పండించే కూరగాయలకు ప్రభుత్వం గిట్టుబటుధర కల్పించాలి రైతులనుఅన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్



**మంచాల వెలుతురు మార్చి 06:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో రైతులు పండించే కూరగాయలకు గిట్టుబటు లేక రైతు గో గిరెడ్డి సుధాకర్ రెడ్డి టమాట పంటను తెంపకుండా వదిలి వేసిన టమాటా పంటను పరిశీలించి న ప్రజాసంఘాల అధ్యక్షుడు కంబాలపల్లి భాస్కర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కూరగాయల కు సరైన ధరలు లేక రైతంగం అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు ప్రభుత్వం ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తక్షణమే స్పందించి రైతులకు నష్ట పరిహారంతో పాటు రైతు భరో సా వేయాలి ఇంకా కొంతమంది రైతులకు రుణమాఫీ కాక ఇబ్బంది పడుతున్నారు వారికి కూడా ప్ర భుత్వం రుణమాఫీ చేసి రైతు భరోసా రైతుల బ్యాంక్ ఖాతాలో వేసిరైతులను ఆదు కో వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం రైతు లేనిదే రాజ్యం లేదని అనేక వేదికలలో మాట్లాడుతారు రైతు క ష్టానికి తగ్గ ఫలితం రాక రైతులు ఆందోళన చెందుతున్నారు రైతు కన్నీరు పెడితే రాజ్యానికే మంచిది కాదు రైతుకు మేమున్నామని భరోసా ఇచ్చి రైతులను ముందుకు తీసుకురావాలి దా నికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి అప్పుడే రైతు ఆనందపడతాడు రైతులను అన్నివిధా లు గా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతులు వస్పరి నరసింహ గో గిరెడ్డి ప్రేమలమ్మ శ్రీకాంత్ రెడ్డి ఆర్ల పర్వతాలు జోగు వినోద్ తదితరులు పాల్గొన్నారు

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు -2026

- తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం మహిళా విభాగం




**బషీర్బాగ్ వెలుతురు 26 మార్చి** తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఎల్ బి స్టేడియం, బషీర్ బాగ్ నందు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ ఏలూరి శ్రీనివాస రావు గారు, ప్రధాన కార్యదర్శి శ్రీ బి శ్యామ్ గారు ముఖ్య అతిథులుగా హాజరవగా, మహిళా చైర్ పర్సన్ డా.జి. దీపారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం లోని 33 జిల్లాల టీజీఓ మహిళా ప్రతినిధులు, వివిధ డిపార్ట్మెంట్ ఫోరంల ప్రతినిధులు, ఇతర ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ మహిళా మణులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. 2026 సంవత్సరపు మహిళా దినోత్సవపు అంశం: give to gain ప్రయోజనం పొందాలంటే ఇవ్వాలి లాభానికి (లాభ పడటానికి) ఇవ్వండి అనే అంశాన్ని ప్రస్తావిస్తూ కార్యక్రమం నిర్వహించ బడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు జడ్జి శ్రీమతి మాధవి మాట్లాడుతూ, క్లారా జెట్కిన్, ఏవిధంగా ఒక సాంఘిక విప్లవం తేవడం ద్వారా, మహిళల అవసరాలు, హక్కుల గురించి పోరాడడం ద్వారా 1921 లో మాస్కోలో జరిగిన 2వ అంతర్జాతీయ కాన్ఫిరెన్స్ లో మార్చి 8ని, అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించినట్లు తెలిపారు. మరియు శ్రీమతి అనితా రామచంద్రన్ IAS, ప్రభుత్వ కార్యదర్శి, మహిళాశిశు, వికలాంగుల మరియు సీనియర్ సిటిజన్ల డిపార్ట్మెంట్ వారు మాట్లాడుతూ మహిళలు శారీరకంగా, మానసికంగా శక్తివంతులుగా తయారు కావాలని కోరారు. ఏలూరి శ్రీనివాస రావు గారు టిజివోస్ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ మహిళలను వివిధ రంగాలలో ప్రోత్సహించడం ద్వారా, మెరుగైన రేపటిని పొందవచ్చని, మహిళలు తమ ఆరోగ్యం, ఆహారం విషయంలో శ్రద్ధ వహించాలి అని, అసోసియేషన్ ఎప్పుడూ మహిళలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉండి, సమస్యలు ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తుందని తెలిపారు. బి. శ్యామ్ గారు టి జి వోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మహిళలకు మద్దతు ఇవ్వడం అంటే సమాజానికి మద్దతు ఇవ్వడమే అని తెలిపారు. మహిళలు విద్య మరియు ఆర్థిక అంశాలపై దృష్టి పెట్టాలని, తమ ఆడపిల్లలను, మగ పిల్లలతో సమనగా చదివించాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో టిజివోస్ సెంట్రల్ మహిళా విభాగపు కన్వీనర్ శ్రీమతి. జె సుజాత, కోశాధికారి, శ్రీమతి. జి. శాంతిశ్రీ తదితర మహిళలు పాల్గొన్నారు. 33 జిల్లాల మహిళా ప్రతినిధులు, 54 ఫోరంల మహిళా ప్రతినిధులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు: ఈ కార్యక్రమంలో టీజీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు: శ్రీ ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి: శ్రీ బి. శ్యామ్, మహిళా విభాగం చైర్పర్సన్: డాక్టర్ దీపా రెడ్డి, కన్వీనర్, సుజాత, కోశాధికారి: జి శాంతి శ్రీ, శిరీష, సంతోషి, జయశ్రీ, రేవతి, డా.చైతన్య, డా.రమాదేవి, డా.శీల, డా.అనిత రెడ్డి, జ్యోష్న, పవిత్ర, పూనం, నవీన్ జ్యోతి, అలివేలు, సైదమ్మ, అనిత, రోజా, ఏంజిలా రెడ్డి, వనజ రెడ్డి, పావని, జ్యోతి, సునీత జోషి,తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్కటి కూడా బీసీలకు ఇవ్వకపోవడం బాధాకరం.

- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్ ఆగ్రహం



**హైదరాబాద్ వెలుతురు మార్చి 06:** తెలంగాణ నుంచి ఖాళీ అయిన రాజ్యసభ స్థానాల్లో ఒక్కటి కూడా బీసీలకు ఇవ్వకపోవడం బాధాకర మైన విషయమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు.మన రాష్ట్రం కాని వారికి అగ్రకులాల వారికి ప్రాతినిధ్యం కల్పించారు గానీ జనాభాలో 60 శాతం పైగా ఉన్న బీసీలకు స్థానం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ సంఘాలుగా ఎన్ని విజ్ఞప్తులు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి మంత్రివర్గం మరియు నామినేటెడ్ పదవుల్లో కూడా బీసీలకు అన్యాయమే చేశారని అన్నారు.

# జిహెచ్ఎంసి కార్మికులకు జిహెచ్ఎంసి వైద్య సేవలు అందించిన గోషామాల్ డివిజన్



**బషీర్ బాగ్ వెలుతురు 6 మార్చి:** రాత్రి పగలు అహర్నిశలు ప్రజల సురక్షితం కోసం పనిచేస్తున్న జీహెచ్ఎంసి కార్మికులు ఆరోగ్య పరిరక్షణ కోసం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిహెచ్ఎంసి ఆరోగ్య శాఖ నేతృత్వంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు.హైద్రాబాద్, నాంపల్లిలోని ఎక్సిబిషన్ గ్రౌండ్ లో అబిడ్స్ జిహెచ్ఎంసి హెల్త్ డిపార్ట్మెంట్ ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు కార్యకమం లో ముఖ్య అతిథిగా గోశామహల్ డిప్యూటీ కమిస్నర్ ఉమాప్రకాష్,ఎఎంహెచ్ఓ డాక్టర్. పి మధుసూదన్ రావు లు పాల్గొని ప్రారంభించారు.పెద్ద ఎత్తున్న పాల్గొన్న 200వందల మంది జిహెచ్ఎంసి కార్మికులు తమ ఆరోగ్య పరీక్షలు చేసుకొని తగిన మందులు తీసుకుని సంతోషం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది,గోశామహల్ డీఈఈ రూపా,జూనియర్ అసిస్టెంట్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు .

# లబ్దిదారుల కొరకు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక పై అధికారులకు అవగాహనా సదస్సు

- పాల్గొన్న శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఇంచార్జి మంత్రి దుద్దిల్లా శ్రీధర్ బాబు




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్ ):** ప్రజా ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల సమస్యలను సమన్వయంతో పరిష్కరించేందుకే 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక అవసరమని అవగాహనా సదస్సులో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఇంచార్జి మంత్రి, ఐటీ, పరిశ్రమల మరియు వాణిజ్య శాఖ మంత్రి దుద్దిల్లా శ్రీధర్ బాబు అన్నారు శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన వివిధ శాఖల అధికారులకు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై జిల్లా ఇన్చార్జి మంత్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పి.మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు నారాయణ రెడ్డి, మను చౌదరి, దీపక్ తివారి, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ల ఆధ్వర్యంలో ప్రధాన అంశాలపై చర్చించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు మంచి పేరు వస్తుందని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు జవాబుదారి తనంతో పని చేయాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి ఐటీ, పరిశ్రమల మరియు వాణిజ్య శాఖ మంత్రి మాట్లాడుతూ.. రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 99 రోజుల పాటు చేపడుతున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో జవాబుదారీ తనంతో ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలిపారు. 99 రోజుల పాటు చేపడుతున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమం అందని వారిని గుర్తించి నిర్లక్ష్యం వహించకుండా అమలు కాని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులకు సూచించారు. శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... 99 రోజుల పాటు చేపట్టే ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో 10 అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రజల వద్దకే అధికారులు వస్తున్నారన్నారు. ఇప్పటికీ రేషన్ కార్డులు, ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇండ్లను కేటాయించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 హామీలను నెరవేర్చే దిశగా పని చేస్తామన్నారు. జిల్లాలోని 5 నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందని అన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. హౌసింగ్ ద్వారా ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు చెల్లింపులు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని గురుకుల పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా, మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యమైన భోజనాన్ని అందించే దిశగా పనిచేస్తామని ఆయన తెలిపారు. ఈ అవగాహన సమావేశంలో శాసన సభ్యులు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, శంకరయ్య, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిలతో పాటు వివిధ శాఖల చైర్మన్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులను అభివృద్ధి పరుస్తా

- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్.

**కుత్బుల్లాపూర్ మార్చి 06 (వెలుతురు ప్రతినిధి):** శుక్రవారం132 - జీడిమెట్ల డివిజన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిజాంపేట్ సర్కిల్ భగత్ సింగ్ నగర్ ఐడిపిఎల్ వర్కర్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలసి కాలనీలోని మురుగునీటి ఔట్ లైన్, బీటీ రోడ్డు మరమ్మత్తు పనుల వంటి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ గత 12 ఏళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాలలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరచామని, రానున్న రోజుల్లో కూడా కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు టీ. శ్రీనివాస రావు, కోశాధికారి ఎస్వీఎన్ వాసు కుమార్, కాలనీ వాసులు ఎస్.మధు, బి.యాదగిరి, కేశవ రావు, రాఘవేంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలు చేయాలి

- ఉప కమీషనర్ శ్రీపాధ రామేశ్వర్.



**కుత్బుల్లాపూర్ మార్చి 06 (వెలుతురు ప్రతినిధి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక తప్పకుండా అమలు చేయాలని గాజులరామారం ఉప కమిషనర్ శ్రీపాధ రామేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి సర్కిల్ అధికారులకు మరియు ఉద్యోగులకు తగు సూచనలు చేశారు. అదేవిధంగా ప్రతిరోజు షెడ్యూల్ ప్రకారము కార్యక్రమాలు నిర్వహించి హెడ్ ఆఫీస్ వారు నిర్దేశించిన ఫార్మాట్లలో రిపోర్టులు సబ్మిట్ చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో అందరూ అధికారులు మరియు సర్కిల్ అన్ని విభాగాలకు సంబంధించిన ఉద్యోగులు యుసిడి, ఆర్ పి లు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో బాలయ్య బస్తి, వి ఎస్ ఆర్ టవర్స్ ఏరియాలో ఫ్రైడే డ్రైడే లో భాగంగా దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకుడు నాగేష్, అధికారులు, చందర్, సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

https://epaper.velthuru.com

నల్గొండ వెలుతురు

## తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలకు ప్రత్యేక కృతజ్ఞతలు

**- టైగర్ పురం సంతోష్ కుమార్**



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 06:** శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పవర్ ఆఫ్ యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్ అసోసియేషన్ అంతర్జాతీయ అధ్యక్షులు, వ్యవస్థాపకులు టైగర్ పురం సంతోష్ కుమార్ రెండు తెలుగు రాష్ట్రాల పోలీస్ శాఖలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఏర్పాటు చేసి సుమారు రెండు సంవత్సరాలు పూర్తవుతున్నాయని చెప్పారు. ఈ కాలంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీజీపీలు, డీఐజీలు, ఐజీలు, వివిధ జిల్లాల ఎస్పీలు, ఏఎస్పీలు, డీఎస్పీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది మీడియా ప్రతినిధులకు మంచి సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్, కేబుల్ న్యూస్, వెబ్ న్యూస్ ఛానెల్స్, ఆన్‌లైన్ పేపర్లు, పీడీఎఫ్ పత్రికలు సమాజంలో జరిగే సంఘటనలను వేగంగా ప్రజలకు అందిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంలో పోలీస్ అధికారులు మీడియాతో స్నేహపూర్వకంగా వ్యవహరించి గౌరవం చూపుతున్నారని అన్నారు. అలాగే కొన్నిచోట్ల జర్నలిస్టులపై దాడులు జరిగినప్పటికీ, ఫిర్యాదు అందిన వెంటనే దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్న పోలీస్ అధికారుల తీరుపై అసోసియేషన్ హర్షం వ్యక్తం చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా మరోసారి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీజీపీలు సహా మొత్తం పోలీస్ శాఖకు టైగర్ పురం సంతోష్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు

## లిక్కర్ కేసు కొట్టివేత అనంతరం తిరుమలలో
## శ్రీవారిని దర్శించుకున్న కల్వకుంట్ల కవిత



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 06:** లిక్కర్ కేసు కొట్టివేయబడిన నేపథ్యంలో కల్వకుంట్ల కవిత తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా "సత్యమే గెలిచింది" అని ఆమె పేర్కొన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే తనపై తప్పుడు కేసు పెట్టారని, కోర్టు తీర్పుతో నిజం వెలుగులోకి వచ్చిందని కవిత తెలిపారు. కడిగిన ముత్యంలా తాను బయటకు వచ్చానని ఆమె అన్నారు. ఈ సందర్భంగా తిరుమలలో కవితను కలసి శుభాకాంక్షలు తెలిపినట్లు తెలంగాణ జాగృతి నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జ్ డా. టీజీ లింగం గౌడ్ తెలిపారు. అనంతరం కవితతో కలిసి తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో కొత్త పార్టీ ఆవిష్కరణ నేపథ్యంలో ప్రజాసేవ కోసం సామాజిక సేవకులు ముందుకు రావాలని, ప్రజలందరికీ మంచి జరగాలని శ్రీవారిని కవిత ప్రార్థించినట్లు తెలిపారు.

## పలు గ్రామాల్లో వివాహ వేడుకలకు హాజరైన చిరుమర్తి లింగయ్య




**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 06:** నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య పలు గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నార్కట్ పల్లి మండలం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన మిడిదోడి శంకరయ్య కుమారుడి వివాహానికి హాజరై వధూవరులకు ఆశీస్సులు అందజేశారు. అలాగే నార్కెట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లంల గ్రామానికి చెందిన ఎర్రబోయిన యాదయ్య కుమారుడి వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఇదే సందర్భంగా నీర్నేముల గ్రామానికి చెందిన ఆవుల భగవంతం కుమార్తె వివాహానికి హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, అభిమానులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేదల పాలిట ఆపద్బాంధవుడు ఎడ్ల మహేందర్ రెడ్డి.

**- వెల్లంకి సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 06:** గ్రామం వెల్లంకి పేదల పాలిట ఆపద్బాంధవుడు బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మన గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి అని వెల్లంకి సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్ అన్నారు. గురువారం నాడు ఎడ్ల మహేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా గ్రామానికి బహుమతిగా గ్రామపంచాయతీ వద్ద 65 వేల రూపాయల తన సొంత నిధులతో నీటి శుద్ధి యంత్రం మరియు శీతలీకరణ యంత్రాన్ని (వాటర్ ఫిల్టర్&వాటర్ కూలర్) సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్ ఏర్పాటు చేసి బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు,మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి శిల్ప దంపతుల చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. అనంతరం మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి ఇంటి వద్ద బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అభిమానులు గ్రామ ప్రజల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎడ్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి మరింత సేవ చేయడానికి ఎల్లప్పుడూ ముందు ఉంటానని రాజకీయాలకతీతంగా పేద ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు ఇస్తూ అండగా ఉంటానని సేవ చేయడానికి పదవులు అవసరం లేదని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఈడెం రాధ శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి నీ ఆదర్శంగా వారి సలహా సూచనలు తీసుకొని గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలియజేశారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిర్యాల రాజకుమార్ వార్డు సభ్యులు నరేష్,శాంతి, లింగయ్య, మల్లమ్మ, జగన్, భాగ్యలక్ష్మి, ఉమా, మరియు బిఆర్ఎస్ అధ్యక్ష కార్యదర్శులు పున్న వెంకటేశం, పిట్ట మహేందర్ రెడ్డి, యువ నాయకులు ఎడ్ల నరేందర్ రెడ్డి, ఈడెం శ్రీనివాస్ , తలారి నరసింహ, పాశం సతీష్ రెడ్డి, ఎడ్ల కృష్ణారెడ్డి మాజీ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు మహేందర్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

## పెళ్లి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 06:**



నీర్నాముల గ్రామానికి చెందిన ఆవుల భగవంతు కుమార్తె వివాహము రామన్నపేట పట్టణ కేంద్రంలోని మల్లికార్జున ఫంక్షన్ హాల్ లో జరగగా అట్టివివామునకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆవుల నరేందర్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లం సతీష్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు ఆవుల శ్రీధర్ వార్డు మెంబర్ చిన్నపాక రమేష్, ఆవుల లక్ష్మీనారాయణ, సల్ల శ్రీనివాస్, ఆవుల సత్తయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

# స్నేహానికి పట్టాభిషేకం.. రాజ్యసభ బరిలో 'వేమన్న'

**- రేవంత్ రెడ్డి నమ్మకానికి ప్రాణం దశాబ్దాల అనుబంధానికి దక్కిన గౌరవం**

**- హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన కేసముద్రం మండల శ్రేణులు**





**కేసముద్రం వెలుతురు మార్చి 06:** రాజకీయాల్లో పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ మనుషుల మధ్య ఉండే నమ్మకం, ప్రాణప్రదమైన స్నేహం ఎప్పటికీ విడదీయలేనిది. దానికి సజీవ సాక్ష్యమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు వేం నరేందర్ రెడ్డిల అనుబంధం. తెలంగాణ రాజకీయ యవనికపై వీరిద్దరి ప్రయాణం ఒక అద్భుత కావ్యం. కష్టాల్లో తోడుగా, కన్నీళ్లలో నీడగా, ప్రతి అడుగులోనూ ఒకరికొకరు వెన్నుదన్నుగా నిలుస్తూ "స్నేహమంటే ఇదేరా" అని చాటిచెప్పిన ఈ అరుదైన బంధానికి నేడు సమున్నత గౌరవం దక్కింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రాణస్నేహితుడు, రాజకీయ సహచరుడు వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేయడం ద్వారా స్నేహానికి పట్టాభిషేకం చేశారు..

**నామినేషన్ వేళ సొంతగడ్డ ఆత్మీయతల వేడుక:**

తెలంగాణ శాసనసభలో రాజ్యసభ అభ్యర్థిగా వేం నరేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేసిన సందర్భం ఒక పండుగలా సాగింది. ఎన్నో ఏళ్లుగా విడదీయలేని బంధాన్ని కొనసాగిస్తున్న కేసముద్రం మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు తమ అభిమాన నాయకుడిని అభినందించేందుకు భారీగా తరలివచ్చారు. ముఖ్యంగా కేసముద్రం మండలానికి చెందిన నాయకుడు సమ్మిగౌడ్, వేం నరేందర్ రెడ్డిని కలిసి భారత రాజ్యాంగ ప్రతిని అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. "వేమన్న రాజ్యాంగబద్ధమైన పదవిలోకి వెళ్లడం మా ప్రాంతానికే గర్వకారణం. పదవులు మనుషులను వెతుక్కుంటూ వస్తాయి అనడానికి నరేందర్ రెడ్డి ఒక ఉదాహరణ. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల ఆయన చూపిన అచంచల విశ్వాసానికి, విధేయతకు దక్కిన ప్రతిఫలం ఇది. స్నేహం కోసం ప్రాణమిచ్చే వ్యక్తులు అరుదుగా ఉంటారు, అలాంటి వారిలో వేమన్న ఒకరు. దేశ అత్యున్నత సభలో ఆయన గళం వినిపించడం తెలంగాణకే గౌరవం" అని ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కష్టాల్లో ఉన్నప్పుడు నరేందర్ రెడ్డి ఎలాగైతే వెన్నంటి నిలిచారో, నేడు ముఖ్యమంత్రిగా తన స్నేహితుడికి తగిన గౌరవం ఇచ్చి రాజకీయాల్లో కొత్త చరిత్రను లిఖించారని కేసముద్రం మండల శ్రేణులు కొనియాడుతున్నాయి. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు మరియు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు..

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక

**- ప్రారంభించిన గుండాల మండల సర్పంచ్ అయిలయ్య**




**గుండాల మార్చి6 (వెలుతురు):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని వివిధ గ్రామాలతో పాటు గుండాల మండల కేంద్రంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించిన గుండాల మండల సర్పంచ్ దేవన బోయిన ఐలయ్య,ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ దేవన బోయిన ఐలయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రతిజ్ఞ చేశారు. కార్మికుల తో కలసి చీపురు పట్టి చెత్తను ఊడ్చరు..మట్టి తట్టను ఎత్తి చెత్తను ట్రాక్టర్లలో పోసి కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజసంక్షేమే ప్రభుత్వ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు.గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, అభివృద్ధి పనులు వేగంగా కొనసాగాలని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రతి వార్డులో పరిశుభ్రత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు కూడా పరిశుభ్రతపై అవగాహన కలిగి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు.ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడతానని అన్నారు.ఈకార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై మీ ఇంటి ఆవరణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.అంగన్వాడి పాఠశాల వద్ద శ్రమధానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆవుల సాయిప్రసాద్, వార్డు సభ్యులు మైసా రమేష్, పండుగ ఉపేందర్, అన్నపర్తి సంధ్య, ఉప్పలయ్య,ఎలుకట్టి ప్రశాంత్,పంచాయతీ కార్యదర్శి ఎండిమున్వర్,ఐసిడిఎస్ సిబ్బంది ఆశా వర్కర్లు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

## రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణను సన్మానించన రెబ్బాసు రాములు

**- రామన్నపేటనియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 06:** మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ ను ఉపసర్పంచ్ మోటే. రమేష్ మరియు పాలకవర్గాన్ని రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు రెబ్బాసు. రాములు ఆధ్వర్యంలో సాల్వాలతో సత్కరించి ఘనంగా సన్మానించడం జరిగినది. అనంతరం మాట్లాడుతూ రామన్నపేట ఒకప్పుడు ఇబ్రహీంపట్నం నుంచి ఆలేరు వరకు నల్గొండ నుంచి శాలిగౌరారం వరకు సమితిగా ఉండేది. అని 1952 నుంచి 2009 వరకు నియోజకవర్గ కేంద్రంగా ఉండేది అని అనంతరం నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా నకిరేకల్ నియోజకవర్గంలో కలవడం జరిగింది. రామన్నపేట ప్రత్యేక నియోజకవర్గం ఏర్పడాలని గత కొన్ని రోజులుగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి ఏర్పాటు చేసుకొని వివిధ రకాల కార్యక్రమాలు చేస్తూ అధికారుల దృష్టికి ప్రజా ప్రతినిధుల దృష్టికి రామన్నపేట నియోజకవర్గ ఏర్పడాలనేసి వారికి వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుంది. అని అందులో భాగంగా రామన్నపేట మండల వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులను సన్మానించడం జరిగిందని రామన్నపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ ఉపసర్పంచ్ మోటే. రమేష్ మరియు పాలకవర్గాన్ని సన్మానిస్తూ రామన్నపేట నియోజకవర్గ సాధన సమితికి మద్దతు ఇవ్వాలని తెలపడం జరిగింది. అనంతరం సర్పంచ్ గరిక సత్యనారాయణ సాధన సమితి అధ్యక్షులు రెబ్బసు రాముల ను సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సాధన సమితి నాయకులు గడ్డం యాదగిరి, బందెల అశోక్, ఎండి ఇమామ్ సాబ్, నకిరేకంటి నరేష్, పెండెం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బర్దీపూర్ ఆశ్రమంలో వైభవంగా దత్తగిరి మహారాజ్ ఆరాధన మహోత్సవాలు

**- ఆది శంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డి...**





**జహీరాబాద్ వెలుతురు మార్చి 05:** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని సుప్రసిద్ధ బర్దీపూర్ ఆశ్రమం గురువారం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ దత్తగిరి మహారాజ్ వార్షిక అమర తిథిని పురస్కరించుకొని ఆశ్రమ ప్రాంగణంలో వివిధ ధార్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహా మృత్యుంజయ మంత్ర శత సహస్ర జపయజ్ఞం, దత్తహోమం వంటి పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో ఆశ్రమం మొత్తం భక్తులతో కిక్కిరిసింది. ఈ ఆధ్యాత్మిక వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆది శంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆశ్రమానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆశ్రమాధిపతి అప్ప గారు డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దత్తగిరి మహారాజ్ వంటి మహనీయుల ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. లోకకల్యాణం కోసం నిర్వహించే యజ్ఞాలు, హోమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ జపయజ్ఞం ద్వారా సమాజానికి ఆయురారోగ్యాలు, శ్రేయస్సు కలగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ ముబీన్, జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, నర్సింహారెడ్డి, అశ్విన్ పాటిల్, జగదీశ్వర్ రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**- రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల**

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 06:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిసరాలలో చెత్త వేయడం, వేయనీయకపోవడం వంటి పనులు చేయడం వల్ల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండడానికి దోహదపడుతాయని అన్నారు. ఇవ్వాళ బాగా అభివృద్ధి చెందినటువంటి దేశాలు పరిశుభ్రంగా ఉండడానికి కారణం ఇలాంటి కార్యాచరణకు పూనుకోవడమే. కావున విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా ఈ 99 రోజుల కార్యక్రమాల్ని విజయవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే,అధ్యాపకులచే పరిసరాల పరిశుభ్రతకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. అదేవిధంగా కళాశాల ఆవరణను శుభ్రం చేయడం, చెట్ల చుట్టూ గుంతలు తీయడంలాంటి పనులను విద్యార్థులు, అధ్యాపకులు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేవుని ఊరేగింపు ప్రతి వీధిలో నిర్వహించాలి

**-బీసీ,ఎస్సీ నాయకులు**



**మోత్కూర్, మార్చి 6,(వెలుతురు న్యూస్ ):** శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి ఊరేగింపు మున్సిపాలిటీలోని అన్ని వీధుల్లో ఊరేగింపు చేసి భక్తులందరికీ దర్శన భాగ్యము కల్పించి భక్తుల ఆకాంక్షను నెరవేర్చాలని శుక్రవారము బీసీ, ఎస్సీ నాయకులు మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో సమావేశమై మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా స్వామివారి ఊరేగింపు పట్టణ ప్రధాన రహదారులపై మాత్రమే చేయడం వల్ల వీధుల్లో ఉండే భక్తులు తీవ్ర మనోవేదనకు గురై స్వామి వారి దర్శనానికి నోచుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ప్రత్యేకంగా పట్టణంలోని డాబంగ్లా, పాత బజార్,గాంధీనగర్, ఇందిరా నగర్ వీధుల్లో స్వామివారి ఊరేగింపు చేయాలని అదేవిధంగా బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చిన విరాళాలు ఖర్చులు ప్రజలకు దేవస్థాన కమిటీ తెలియ పరచాలని దేవస్థాన కమిటీని బీసీ ఎస్సీ నాయకులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు పోచం సోమయ్య, ఎడ్ల నరేష్, కందుకూరి ప్రకాష్, గుమ్మడవెల్లి పరుశు రాములు, అన్నెపు సత్యనారాయణ, అన్నెపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

## కార్యసిద్ధిని కలిగించే దైవం శ్రీ లక్ష్మీ గణపతి స్వామి

**- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్ మార్చి 06 (వెలుతురు ప్రతినిధి):**

జిహెచ్ఎంసి కొంపల్లి సర్కిల్ పరిధి జయభేరి కాలనీ నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్వహించనున్న శ్రీ లక్ష్మీ గణపతి, కాశీ విశ్వనాథ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....చేపట్టిన ప్రతి పనిలో విజయం చేకూర్చే దైవం వినాయకుడని, లక్ష్మీ గణపతి స్వామి కృపా కటాక్షాలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆదిరెడ్డి రవీందర్ రెడ్డి, సభ్యులు రామ్మోహన్, నరసింహ, నరేందర్ రెడ్డి, మహబూబ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మనోజ్ కుమార్, విశ్వనాథ శర్మ, ఆదిరెడ్డి రాజిరెడ్డి, ఓబి రాజు, గోపాల్ రెడ్డి, మల్లారెడ్డి, జి రాజిరెడ్డి, సంజీవరెడ్డి, సదానందం, విలాస్ కుమార్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి ఐక్యతకు ప్రతీకగా టీఎన్‌జీఓ మహిళా దినోత్సవ కార్యక్రమం






**హైదరాబాద్, వెలుతురు 06 మార్చి 2026:** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ కేంద్ర సంఘం ఆధ్వర్యంలో మహిళల ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహించిన ఆటపోటీలు ఈరోజు ఉస్మానియా మెడికల్ కాలేజ్ ఆడిటోరియంలో ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మెడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా నుండి మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జిల్లాకు చెందిన మహిళా ఉద్యోగులు నజీమా, సత్య జ్యోతి, అరుణ తదితరులు కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన కేంద్ర సంఘం అధ్యక్షులు జగదీశ్వర్, ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ శ్రీ బి. రవి ప్రకాష్ గారు మహిళా ఉద్యోగులను అభినందిస్తూ, మహిళల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు వారు కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఉద్యోగులతో కలిసి వారిని ప్రోత్సహించారు.



ఎనిమిదో తారీఖున జరగబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామానుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మహిళల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రివర్యులు సీతక్క విచ్చేస్తున్నారు దీనికి సంబంధించి శుక్రవారం రోజున వారు ఇన్విటేషన్ కార్డు మరియు ప్రెస్ ప్రకటన విడుదల చేయడం జరిగింది.

**హైదరాబాద్ వెలుతురు మార్చి 06:**

## మూసివేసిన నీరాకేఫ్ ను తెరిపించాలి

**- టెండర్ ద్వారా టాడి కార్పొరేషన్ కు అధిక ఆదాయం వచ్చేలా చూడాలి**




**హైదరాబాద్ వెలుతురు మార్చి 06:** కల్లుగీత సొసైటీలకు అవకాశం కల్పిస్తూ హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు లోని నీరా కేఫ్ ని వేలంపాట వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తుంది. దీని ద్వారా వచ్చే ఆదాయం టాడి కార్పొరేషన్ ద్వారా గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయవచ్చు. అందుకని దీనిని మంచిగా నడిపే సొసైటీ వారు తీసుకొని సంస్థకు మంచి ఆదాయం వచ్చేలా చూస్తారని ఆశిస్తున్నాం. అభివందనములతో యం.వి.రమణ, రాష్ట్ర అధ్యక్షులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. కల్లుగీత కార్మిక సంఘం. కేజీకేఎస్

## జాతీయ ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు మోకిలా తాండ వాసుల ఘన జన్మదిన శుభాకాంక్షలు



**శంకర్పల్లి వెలుతురు మార్చి 6 :**

జాతీయ ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకొని మోకిలా తాండ వాసులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన సమాజ సేవలను ప్రశంసించారు. దళిత, గిరిజన సమాజాల అభివృద్ధి కోసం జాటోత్ హుస్సేన్ నాయక్ నిరంతరం కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణకు ఆయన చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని వారు అభినందించారు. ఈ సందర్భంగా మోకిలా తాండ వాసులు మాట్లాడుతూ ఆయన మరింత ఉన్నత స్థానాలు అధిరోహించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. అలాగే ఆయనకు ఆరోగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాబు నాయక్ పుల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి బజార్‌లో హస్తకళల ప్రదర్శన ప్రారంభం

**- చేతివృత్తులను ప్రోత్సహించాలి సినీనటి అమల అక్కినేని**

**- ఇందిరా మహిళా శక్తి బజార్‌లో మహిళా సంఘాలకు ఉచితంగా షాపులు**

**- సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్**

**- ఆదివారం నాడు హస్తకళల ప్రదర్శనను సందర్శించనున్న మంత్రి సీతక్క**














**హైదరాబాద్ వెలుతురు మార్చి 06:**

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ఇండియా హ్యాండ్ మేడ్ కలెక్టివ్ (IHMC), సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (SERP) సంయుక్త ఆధ్వర్యంలో హస్తకళల ప్రత్యేక ప్రదర్శన ప్రారంభమైంది. చేతివృత్తిదారులను ఒకే వేదికపైకి తీసుకురావడం, వారు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడం, హస్తకళలకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సినీనటి, ఎనిమల్ రైట్స్ కార్యకర్త అమల అక్కినేని, SERP సీఈఓ దివ్య దేవరాజన్, టెక్స్టైల్ నిపుణులు మరియు CCT వ్యవస్థాపక సభ్యురాలు విజయలక్ష్మి నార్నే, వ్యవసాయ శాస్త్రవేత్త మరియు CSA ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. జి.వి. రామంజనేయులు ప్రారంభించారు. అనంతరం ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌తో పాటు విక్రయాలతో కూడిన ప్రత్యేక ప్రదర్శనను వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అమల అక్కినేని సాంప్రదాయ చేతివృత్తులను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. భారతీయ సంప్రదాయాలకు ప్రతీకలైన చేతివృత్తులు మన సంస్కృతికి అద్దం పట్టేవని, వాటి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక కుటుంబాలు తరతరాలుగా చేతివృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని, యంత్రాల ఆధిపత్యం పెరగడంతో ఈ వృత్తులు క్రమంగా క్షీణిస్తున్నాయని తెలిపారు. చేతివృత్తుల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పిస్తే కళాకారులకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. యువత చేతివృత్తుల వైపు ఆకర్షితులయ్యేలా శిక్షణ, ప్రోత్సాహకాలు అవసరమని సూచించారు. SERP సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి బజార్‌గా అభివృద్ధి చెందిన ఈ ప్రాంగణం ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురై వివాదాల్లో చిక్కుకుందని తెలిపారు. ఈ స్థలాన్ని వేలం వేస్తే రూ.500 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క మహిళల సాధికారత కోసం దీన్ని మహిళా స్వయం సహాయక సంఘాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఒకప్పుడు చెత్త మైదానంలా కనిపించిన ఈ స్థలాన్ని గ్రామీణ మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించుకునే కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సుమారు రూ.9 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మధ్యవర్తులు లేకుండా లాభాలు నేరుగా ఉత్పత్తిదారులైన మహిళలకే చేరేలా ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళా సంఘాలకు షాపులను ఉచితంగా కేటాయించినట్లు పేర్కొన్నారు. IHMC తెలంగాణ చాప్టర్‌లో చేతితో నేసిన వస్త్రాలు, సహజ వర్ణాలతో తయారైన దుస్తులు, అలంకరణ వస్తువులు, సహజ ఫైబర్ కళాకృతులు, మట్టి ఆభరణాలు, లాకర్ బొమ్మలు, వంట సామగ్రి, సహజ పదార్థాలతో తయారైన చర్మ సంరక్షణ ఉత్పత్తులు, ప్రత్యేక గిఫ్ట్ కాంబినేషన్లు అందుబాటులో ఉంచారు. భారతీయ చేతివృత్తుల వైభవాన్ని ప్రజలకు పరిచయం చేయడం కోసం ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌తో పాటు పలు శిక్షణా వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఈ బజార్‌ను సందర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం IHMCతో అనుబంధంగా ఉన్న సంస్థలు సుమారు 2,500 మంది గ్రామీణ చేతివృత్తిదారులతో కలిసి పనిచేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో MRDUకు చెందిన ఉదయ దైతి, సుకల్ప సంస్థకు చెందిన సర్వాణి, తులా ఆర్గానిక్ క్లాతింగ్‌కు చెందిన జాహ్నవి, ఎలిఫెంట్ ఇన్ యూ సంస్థకు చెందిన అలంకృత, టింక్టోరియా సంస్థకు చెందిన సవిత తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరై తమ ఉత్పత్తులను ప్రదర్శించారు.

## దోమల నిర్మూలనతో సంపూర్ణ ఆరోగ్యం..

**- డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి**



**కూకట్ పల్లి మార్చి 6 వెలుతురు:**

ఆరోగ్యాన్ని దెబ్బతీసే దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి అన్నారు. రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాలనీలో దోమల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై కాలనీ వాసులకు, కమిటీ సభ్యులకు దోమల వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, వాటి నివారణ చర్యలపై క్లుప్తంగా వివరించారు. అనంతరం కాలనీలో అవగాహన ర్యాలీ చేపట్టారు. దోమల పెరుగుదలను అరికట్టడానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. కాలనీ కమిటీ సభ్యులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కాలనీ ప్రజలు ఎల్లప్పుడూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి కార్యక్రమాన్ని ముందుండి విజయవంతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జనం పల్లి పురంధర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో పరిశుభ్రతను కాపాడేందుకు కమిటీ సభ్యులు, కాలనీవాసులు సమిష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల సహకారంతో కాలనీని మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రామచంద్రరావు, కమిటీ సభ్యులు జి. ప్రసాద్, ఎన్. మూర్తి, టైగర్ పురుషోత్తం, సూర్యనారాయణ, కిషోర్, సునీత, సునీల్ పటేల్, నరేందర్ రెడ్డి, శీను, నాని, చల్లారావు, అంజి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ అభ్యర్థిగా వేం నరేందర్ రెడ్డికి అభినందనలు వెల్లువ...



**కూకట్ పల్లి మార్చి 6 వెలుతురు:**

కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన వేం నరేందర్ రెడ్డిను పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం శుక్రవారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ విధేయంగా పనిచేసిన నాయకుడికి పార్టీ అధిష్టానం రాజ్యసభకు అవకాశం కల్పించడం అభినందనీయం అన్నారు. సాధారణ కార్యకర్తల సమస్యలను తెలుసుకుంటూ పార్టీని బలోపేతం చేయడంలో వేం నరేందర్ రెడ్డి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆయన చేసిన కృషి విశేషమని తెలిపారు. ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికు వెన్నంటి ఉండి పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడికి సరైన గుర్తింపు లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇంతకుముందు ప్రభుత్వ సలహాదారుగా సేవలందించిన వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక కావడం పార్టీకి గర్వకారణమని డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు.



## కొత్తగూడెం రేడియో స్టేషన్‌లో కట్టెకోలకు సత్కారం

**- ఉగాది కవి సమ్మేళనంలో కవితా గానం**

**- నరసయ్యను అభినందించిన స్టేషన్ డైరెక్టర్ శంకర్రావు**

**ఖమ్మం వెలుతురు మార్చి 6:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోల చిన నరసయ్యకు ఘన సత్కారం లభించింది. కొత్తగూడెం రేడియో స్టేషన్ డైరెక్టర్ కొలిపాక శంకర్రావు ఆధ్వర్యంలో ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన కవులు, కవయిత్రుల చేత శుక్రవారం పరాభవ నామ ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. వ్యాఖ్యాతగా కట్టా రామకృష్ణ వ్యవహరించారు. ఈ కవి సమ్మేళనంలో కట్టెకోల చిన నరసయ్య అమానవీయ యుద్ధాలు అనే శీర్షికన రచించిన కవితను ఆలపించారు. ప్రపంచంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఈ కవిత సమాజానికి అద్దం పట్టిందని ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ శంకర్రావుతో పాటు పలువురు నరసయ్యను అభినందించారు. అనంతరం కట్టెకోలను పూలు, పండ్లతో తువ్వాలు కప్పి ఘనంగా సత్కరించారు.

## ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు చలివేంద్రం కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో నీటి కుండల ఏర్పాటు..



**కూకట్ పల్లి మార్చి 6 వెలుతురు:**

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు కాంగ్రెస్ నాయకులు ముందుకొచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఏకాంత్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు విద్య కల్పన ఏకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ నగర్ డివిజన్‌లోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థుల కోసం నీటి కుండలను ఏర్పాటు చేసి, రోజువారీగా మినరల్ వాటర్ అందించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వేసవిలో చిన్నారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏకాంత్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రమైన తాగునీరు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమానికి ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గణేష్ గౌడ్, పల్నాటి అశోక్, బొట్టు శ్రీను, డివిజన్ సోషల్ మీడియా ఇంచార్జ్ వినోద్, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సంధ్య, కార్యవర్గ సభ్యురాలు షాలిని జితేందర్, డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నాగమణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం







**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 6**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగం శుక్రవారం నాడు జిల్లాలో 99 రోజులు ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రామారెడ్డి పి హెచ్ సి మరియు యు పి హెచ్ సి రాజీవ్ నగర్ లో ప్రత్యేక సేవలు ఆరోగ్య కార్యక్రమం నిర్వహించబడినది యూపీఎస్సీ రాజీవ్ నగర్ డాక్టర్ రవీందర్ గౌడ్ గారి చేతుల మీదుగా 99 రోజుల ఆరోగ్య కార్యక్రమం ప్రారంభించబడినది ఈ కార్యక్రమంలో భాగ్యం గర్భిణుల ఆరోగ్య పరీక్షలు రక్తపోటు షుగర్ పరీక్షలు క్యాన్సర్ పరీక్షలు టీవీ ఎక్రే పరీక్షలు కంటి పరీక్షలు మొదలవు మొదలగు పరీక్షలు ప్రత్యేక వైద్య నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించబడినవి . అదే విధంగా పిల్లల సేకరణ సేవలు హెచ్ఐవి వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది ఈ కార్యక్రమము మార్చి 6 నుండి జూన్ 12 వరకు నిర్వహిస్తారని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రత్యేక వైద్య నిపుణులు ఆధ్వర్యంలో రోగులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు యుపిఎస్సి రాజీవ్ నగర్ లో 185మందికి ఆరోగ్య పరీక్షలు అదేవిధంగా పి హెచ్ సి.రామారెడ్డి లో 122 మందికి ప్రత్యేక వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు ఇందులో 86 మంది పురుషులు 21 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు 142 మందికి ఆసుపత్రులకు రిఫర్ చేశారు మరియు మందులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ శిరీష డాక్టర్ ధరావత్ దేవేందర్ డాక్టర్ నాగార్జున డాక్టర్ రమ్య డాక్టర్ అనిల్ కుమార్ డాక్టర్ సమీనా డాక్టర్ సుమన్ రెడ్డి డాక్టర్ సావన్ డాక్టర్ జావేద్రావు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ రవీందర్ గౌడ్ మరియు ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్లు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు అదేవిధంగా ఈరోజు జిల్లాలోని 13 తీఎంఎ ఎష్ట్ టీములు 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య నిపుణుల ఆధ్వర్యంలో 1383 విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు మరియు మందులు పంపిణీ చేశారు ఎనిమియా కంటి పరీక్షలు మరియు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు

## మార్చ్ 24, 25 తేదీలలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభలు జయప్రదం చేయండి

**- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 6**

కామారెడ్డి జిల్లాలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మూడవ మహాసభలను మార్చి 24 25 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు ఈ మహాసభలకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములుగారు సిపిఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి గారు ప్రజా కవి ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న గారూ హాజరవుతున్నట్లు తెలిపారు కామారెడ్డి జిల్లాలో నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ విజయాలు సాధించిన చరిత్ర ఉందని ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఇళ్ల స్థలాలు సాగు భూములు పోడు భూములు రైతుల కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని సందర్భంగా జరిగే ఈ జిల్లా మహాసభలను జిల్లా నలుమూలల నుండి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నాం

## ప్రజల చెంతకే స్పెషలిస్ట్ వైద్యం

**- నెరడిగొండలో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

**నెరడిగొండ, వెలుతురు మార్చి 6 :**







గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన నిపుణుల వైద్య సేవలను వారి ముంగిటకే చేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఏర్పాటు చేసిన స్పెషలిస్ట్ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గతంలో స్పెషలిస్ట్ వైద్యం కోసం గ్రామీణులు పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు ప్రభుత్వం నిపుణులైన వైద్యులను నేరుగా పీహెచ్‌సీలకే పంపిస్తోందని చెప్పారు. ప్రజా పాలనలో భాగంగా ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరిస్తున్నామని, ప్రతీ ఒక్కరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని, వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. అనంతరం శిబిరానికి వచ్చిన రోగులతో మంత్రి స్వయంగా మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా కలెక్టర్ రాజార్షి షా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవం

**- టి ఎన్ జి ఓ ఎస్ ఆధ్వర్యంలో ఐ డి ఓ సి లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు**






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 6**

శుక్రవారం IDOC కార్యాలయంలో TNGO's సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగుల ఆత్మీయ సన్మానం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు విక్టర్ మధుమోహన్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల సాధికారతే సమాజ పురోగతికి పునాది అని ఆయన తెలిపారు. ప్రభుత్వము మహిళల అభివృద్ధి, భద్రత, విద్య , ఆర్థిక స్వావలంబన కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆయన అన్నారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని మరింత ముందుకు సాగాలని సూచించారు. TNGO's సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు కార్యాలయాలలో సమాజంలో సమాన అవకాశాలతో ముందుకు రావాలని ఆకాంక్షించారు. మహిళా ఉద్యోగులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, TNGO's నాయకులు, నరాల వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి ముల్కా నాగరాజు, సహాధ్యక్షులు చక్రధర్, కేంద్ర సంఘం బాధ్యులు శివకుమార్, వైస్ ప్రెసిడెంట్ రాజ్యలక్ష్మి, పోచయ్య, రాజేశ్వర్, సహాయక కార్యదర్శులు రాజమణి, సంతోష్, మహేష్, రాజిరెడ్డి, ప్రవీణ్, దత్తాద్రి, జిల్లా, తాలూక కార్యవర్గ సభ్యులు, కలెక్టరే ఉద్యోగాలు, కళాకారులు, మహిళా ఉద్యోగులు , ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలు అంగన్వాడీ సెంటర్లను సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**-మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న**



**మోత్కూర్,మార్చి 6,(వెలుతురు న్యూస్ ):**

మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో అంగన్వాడి సెంటర్ 1 లో మోత్కూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గారు తన సొంత ఖర్చుతో గర్భిణీలకు శ్రీమంతం, పిల్లలకు అక్షరాభ్యాసం, అన్న ప్రాసన కార్యక్రమాన్ని చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సి. డి. పి. ఓ. యామిని గారు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని అంగన్వాడీ సెంటర్లో ఇచ్చే బాలామృతం పిల్లలకు క్రమం తప్పకుండా ఇవ్వాలని అన్నారు. చైర్మన్ గడ్డం స్వప్న మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పౌష్టికాహారం కల తీసుకోవాలని ఇలా మున్సిపల్ కమిషనర్ గారు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని క్రమం తప్పకుండా భోజనం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు ఎం. సునీత, కే.విజయ, పి. నర్సమ్మ, పి. సునీత, రేణుక, అలివేలు మంగ, సుమలత, మంజుల, సువర్ణ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలులో ఉమ్మడి జిల్లాను ముందంజలో నిలుపాలి

- **జిల్లా ఇంచార్జి మంత్రి ధనసురి అనసూయ సీతక్క**
- **99 రోజుల ప్రణాళిక అమలుపై సన్నాహక సమావేశం**
- **అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి**
- **పాల్గొన్న ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే భూపతిరెడ్డి**
- **ప్రగతి ప్రణాళిక అమలు కార్యాచరణను వెల్లడించిన కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్**



**నిజామాబాద్, వెలుతురు మార్చి 06 :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలులో నిజామాబాద్, కామారెడ్డిలతో కూడిన ఉమ్మడి జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసురి అనసూయ సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా విచ్చేసి, ఉమ్మడి జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేయగా, ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి, మహమ్మద్ షబ్బీర్ అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్ లు ప్రగతి ప్రణాళిక అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక గురించి ఆయా శాఖలు, అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఇంచార్జి మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ, పల్లెలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వం ఆయా శాఖల వారీగా పరిసరాల పరిశుభ్రత. ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ పైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్.. అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, రైతు సంక్షేమం.. వ్యవసాయం, విద్య, యువత.. క్రీడలు, మహిళలు, పర్యావరణం అంశాలలో నిర్దేశిత లక్ష్యం మేరకు ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా విజయవంతం అయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉద్యోగులు ప్రగతి ప్రణాళిక అమలులో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేస్తూ, ప్రజలకు జవాబుదారీగా పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ ప్రణాళిక అమలు ద్వారా రానున్న మూడు నెలల వ్యవధిలో ప్రజారోగ్యం, విద్య, వైద్యం, అంగన్వాడీల నిర్వహణ, స్త్రీ శిశు సంక్షేమం, పారిశుధ్యం తదితర అంశాలలో స్పష్టమైన మార్పు కనిపించేలా అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాలలో బాల్య వివాహాలు వంటి సామాజిక రుగ్మతలను దూరం చేసేందుకు, డ్రగ్స్, కల్తీకల్లు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్ధాల గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, వాటి నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఇంచార్జి మంత్రి ఆదేశించారు. అంగన్వాడి, గ్రామ పంచాయతీ, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలపై గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆదర్శ పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లడమే లక్ష్యంగా, అధికారులు సమన్వయంతో పని చేసి ఈ 'ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలని మంత్రి ధనసురి అనసూయ అధికారులను కార్యోన్ముఖులను చేశారు. ఈ కార్యక్రమం పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను వినియోగించాలని ఉమ్మడి జిల్లా అధికారులకు సూచించారు. ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ప్రగతి ప్రణాళిక అమలులో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలతో కూడిన అంశాలపై ప్రత్యేక దృష్టిని



కేంద్రీకరించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా అవగాహన పెంపొందించాలని సూచించారు. అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయిస్తూ, రోడ్ల మరమ్మతులు, రెవెన్యూ సంబంధిత అంశాల అనుమతుల జారీ వంటి వాటిపై దృష్టిని కేంద్రీకరించాలని అధికారులను కోరారు. వేసవిలో ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగానే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. కేంద్రం ద్వారా సమకూరే నిధులతో చేపట్టాల్సి ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయించేలా చొరవ చూపాలని, తద్వారా నిధులు మురిగిపోకుండా, వెనక్కి మళ్లిపోకుండా పూర్తి స్థాయిలో సద్వినియోగం అయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్ నగర మేయర్ కే.ఉమారాణి, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య, కామారెడ్డి ఎస్.పీ రాజేష్ చంద్ర, నిజామాబాద్ అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఎఫ్ఓ లు వికాస్ మీనా, నిఖిత, ఏసీపీ చైతన్య రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన అన్ని శాఖల అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్ లు, తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముగ్గురు దివ్యాంగులకు మంత్రి సీతక్క చేతుల మీదుగా ల్యాప్ టాప్ లు అందజేశారు.

**మినీ సరస్ ఫెయిర్ – 2026 ను ప్రారంభించిన మంత్రి సీతక్క**

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, సెర్ప్, నాబార్డు ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ సరస్ ఫెయిర్ – 2026 ను ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠిలతో కలిసి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసురి అనసూయ సీతక్క లాంచనంగా ప్రారంభించారు. గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ప్రదర్శన, విక్రయ స్టాళ్లను తిలకించారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. మహిళా ప్రగతి–తెలంగాణ ఉన్నతి అనే నినాదానికి కట్టుబడి ముఖ్యమంత్రి







రేవంత్ రెడ్డి మహిళల ఆర్థిక అభ్యున్నతికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే వడ్డీ లేని రుణాల పంపిణీ, ఉచిత ప్రమాద బీమా, లోన్ బీమా, ఆర్టీసీలో అద్దె బస్సులు, పెట్రోల్ బ్యాంకులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. వచ్చే మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం తమ ప్రభుత్వం మరిన్ని కొత్త పథకాలను ప్రవేశపెట్టనుందని మంత్రి వెల్లడించారు. మహిళలు ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజిరెడ్డి, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వినాయక నగర్ లోని విజయలక్ష్మి గార్డెన్స్ లో నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సాధికారత కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. నిజామాబాద్ పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి ధనసూరి అనసూయ సీతక్కకు ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర జిల్లా అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.



https://epaper.velthuru.com

# ఆమెది న్యాయ పోరాటం...

**బాధల్ని బలంగా మల్చి... వందల మందికి న్యాయం చేసిన మహిళ**

## సీనియర్ అడ్వకేట్ లక్ష్మీ కట్ట

**(అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రత్యేక కథనం)**

*సమాజంలో ఎన్నో అవమానాలు, అడ్డంకులు ఎదురైనా వాటిని ఎదుర్కొని నిలబడిన మహిళలు చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో ఒకరు లక్ష్మీ కట్ట. పల్లెటూరి నుంచి వచ్చి సాధారణ మహిళగా ప్రారంభమైన ఆమె ప్రయాణం, నేడు వందల మందికి ఆదర్శవంతంగా మారింది. ఎన్నో జీవితాల్లో వెలుగు నింపి న్యాయ దేవతగా మారింది. "ఆడవాళ్లు కూడా స్వశక్తితో నిలబడగలరు" అనే సందేశం తన జీవితమే ప్రేరణ. మహిళలకు అండగా నిలిచి న్యాయానికి మారుపేరుగా నిలిచారు.*

### కోనసీమ నుంచి న్యాయవాదిగా

లక్ష్మీ కట్ట 1975 జూలై 13న ప్రస్తుత కోనసీమ అంబేద్కర్ జిల్లాలో జన్మించారు. తండ్రి కుమార్ రావు, తల్లి సునీత. ఎగువ మధ్యతరగతి కుటుంబంలో పెరిగిన ఆమెకు చిన్నప్పటి నుంచే చదువులకు ప్రాధాన్యం ఇచ్చారు. పిల్లలు చదువుకొని సమాజంలో మంచి స్థానానికి చేరాలని తండ్రి ఆశపడేవారు. ఆ ఆశయమే ఆమెను ఉన్నత స్థాయికి తీసుకెళ్లింది.
నలుగురు సంతానం ఉన్న కుటుంబంలో పెరిగిన లక్ష్మీ కట్ట, తండ్రిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగారు. డిగ్రీ వరకు కోనసీమలో చదివిన ఆమె, ప్రజలకు న్యాయం చేయాలనే సంకల్పంతో రాజమండ్రికి వెళ్లి ఎల్.ఎల్.బి పూర్తి చేశారు. అనంతరం పీజీ చేసి, హైదరాబాద్‌లోని నల్సార్ విశ్వవిద్యాలయంలో ఫ్యామిలీ, డిస్ప్యూట్ రిలీజియస్ స్టడీస్‌లో ప్రత్యేక శిక్షణ పొందారు.

### సమాజాన్నే ఎదిరించిన ప్రేమ వివాహం

సమాజంలో ఉన్న కుల భావాలు, అప్పటి పరిస్థితులను, అన్యాయాలను ప్రశ్నించాలనే ఉద్దేశంతో ఆమె ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే ఆ సమయంలో కట్నం రాలేదనే కారణంతో అత్తవారితో వరకట్న వేధింపులకు కూడా గురయ్యారు. ఆ సంఘటనలు ఆమెను మొండిగా తయారు చేశాయి. తాను సమాజంలో నిలబడాలని మరింత కసితో ముందుకు సాగారు.

### అవమానాల మధ్య మొదలైన న్యాయప్రస్థానం..

2004లో న్యాయవాదిగా తన ప్రాక్టీస్‌ను ప్రారంభించారు. పల్లెటూరి నుంచి వచ్చిన కారణంగా భాషపై పట్టులేదని కొందరు తక్కువ చేసి మాట్లాడినా ఆమె వెనక్కి తగ్గలేదు. ఆ అవమానాలే ఆమెకు మరింత ధైర్యాన్ని ఇచ్చాయి.
ఇప్పటికి ఆమెకు 22 సంవత్సరాల న్యాయ అనుభవం ఉంది. ఈ కాలంలో వందలాది కేసులు వాదించి, అనేక కుటుంబాలకు న్యాయం చేశారు.

### వ్యక్తిగత బాధలు.. సమాజసేవకు మార్గం వేశాయి..

ప్రాక్టీస్ మధ్యలో ఆరోగ్య సమస్యలు, తండ్రి, భర్త దూరమవ్వడం వంటి సంఘటనలు ఆమె జీవితంలో తీవ్ర బాధను మిగిల్చాయి. అయితే ఆ కష్టాలే ఆమెను మరింత బలంగా తీర్చిదిద్దాయి.
"నా లాంటి బాధలు మరెవరూ అనుభవించకూడదు" అనే సంకల్పంతో బాధితులకు సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు.

### వందల కేసులు ఉచిత సేవలు

న్యాయవాదిగా పని చేస్తూనే మహిళలు, పేదలు ఎదుర్కొనే సమస్యలను దగ్గరగా చూశారు. అందుకే డబ్బు లేని వారికి ఉచితంగా న్యాయ సహాయం అందించడం ప్రారంభించారు. ఇప్పటివరకు ఆమె 150 నుంచి 200 కేసులు సెటిల్‌మెంట్ చేశారు. వందలాది కుటుంబ వివాదాలను పరిష్కరించారు. వేల మందికి కౌన్సిలింగ్ అందించారు. డిప్రెషన్, మానసిక ఒత్తిడి, కుటుంబ సమస్యలతో బాధపడుతున్న వారికి ఆమె ఒక అక్కలా అండగా నిలిచారు.

### సమాజ సేవలో ముందంజ

న్యాయ సేవలతో పాటు సామాజిక సేవలో కూడా ఆమె చురుకుగా పాల్గొంటున్నారు. అనాధాశ్రమాలు, దేవాలయాలు,



మసీదుల వద్ద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అవసరమైన వారికి సహాయం చేస్తున్నారు.
2015లో "వనిత" కార్యక్రమం ద్వారా మహిళలకు ఉచిత న్యాయ సలహాలు అందించడం ప్రారంభించారు. యూట్యూబ్ ద్వారా కూడా కుటుంబ సమస్యలు, వ్యక్తిగత జీవిత సమస్యలపై మార్గదర్శనం చేస్తున్నారు. లక్ష్మీ కట్ట సేవలు కేవలం కోర్టు గదులకే పరిమితం కాలేదు. పేద పిల్లలకు బట్టలు, చదువు సహాయం, అనాధలకు ఆశ్రయం, ట్రాన్స్‌జెండర్ మహిళలకు కౌన్సిలింగ్, వంటి సేవల ద్వారా ఆమె సమాజానికి ఆదర్శంగా నిలిచారు. తన సంపాదనలో 25 శాతం చారిటీకి అందించి గొప్ప తనాన్ని చాటుకున్నారు.

### గౌరవాలు, పురస్కారాలు

- సమాజ సేవకు గుర్తింపుగా లక్ష్మీ కట్టకు పలు అవార్డులు లభించాయి.
- డాక్టరేట్ గౌరవం
- జీవిత సాఫల్య పురస్కారం
- మదర్ తెరెసా అవార్డు
- తెలుగు రత్న అవార్డు
- మెగా హెల్తింగ్ ఫౌండేషన్ నుంచి గోల్డెన్ నంది అవార్డు

ఈ అవార్డులు ఆమె సేవలకు వచ్చిన గుర్తింపుగా నిలిచాయి.
రోజుకు సేవకే తన టైమ్ అంతా...
తన బిజీ షెడ్యూల్ మధ్యలో కూడా ప్రతిరోజూ 2 నుంచి 3 గంటలు సామాజిక సేవకు కేటాయిస్తారు. ఎప్పుడు ఫోన్ చేసినా బాధితులకు స్పందించి సహాయం చేస్తారు.
ఆశ్రయం లేని వారు, విద్య కోసం సహాయం కావాల్సిన వారు ఎవరైనా ముందుకొస్తే సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటానని ఆమె చెబుతున్నారు. "ఆడవాళ్లు బలహీనులు కాదు" సమాజంలో ఎన్నో కష్టాలు ఎదురైనా వాటిని అధిగమించి నిలబడిన లక్ష్మీ కట్ట జీవితం మహిళలకు ప్రేరణగా నిలుస్తోంది. "ఆడవాళ్లు బలహీనులు కాదు. స్వశక్తితో ముందుకు వస్తే ఏ స్థాయికైనా చేరుకోవచ్చు" అని ఆమె జీవితం చెబుతోంది.

**రచన...: రాహుల్ కశ్యప్..**

## 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవద్దనే సంకల్పానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నారు. స్వప్రయోజనాల కోసం సాంకేతికతను ఉపయోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని , దానికి బానిసై చెడుకు ఉపయోగిస్తే నాశనమవుతారని అన్నారు. 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని సూచన వచ్చిందని, వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని, 13–16 ఏళ్ల లోపు వారికి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి అవినీతిని కట్టడి చేశామని సీఎం చెప్పారు. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను మారుస్తున్నామని.. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు వేశారని ముఖ్యమంత్రి వివరించారు. 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకున్నారన్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలల నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. 9 కోట్ల పనిదినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని సీఎం తెలిపారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగిందన్నారు. బ్జడెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుందామన్నారు సీఎం. పల్లెల్లో కొత్త వెలుగులు చూసేందుకు ఉప ముఖ్యమంత్రి తీసుకుంటున్న కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలోనూ వివిధ సంస్కరణల్ని అమలు చేసి నైపుణ్యం పెంచేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నామని సీఎం తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నామని.. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తామన్నారు. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించేలా చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు ముఖ్యమంత్రి. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గిన్నీస్ రికార్డు సాధించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డేను నిర్వహించామన్నారు. యోగా, నేచురోపతి లాంటి అంశాలను మేళవించి ప్రజారోగ్యాన్ని కాపాడతామని తెలిపారు. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైట్ కాలర్ క్రైమ్స్, డిజిటల్ క్రైమ్స్, సైకోలు సోషల్ మీడియాలో అరాచకం చేస్తున్నారని.. మహిళలపై నేరాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. మావోయిస్టులను కట్టడి చేశామని.. ఫ్యాక్షనిజాన్ని రూపుమాపామని తద్వారా ప్రగతి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చిందని.. 'పెళ్లికి వెళ్తే కూడా రప్పా రప్పా అంటూ దాడులు చేయాలా? భద్రతకు వెళ్లిన ఎస్ఐ గాయపడేలా పర్యటనలు ఉంటాయా? గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకునే నాయకుడు ఎక్కడైనా ఉంటారా? కటౌట్లకు పొట్టేళ్లతో రక్తాభిషేకం చేయటం ఏమిటి? ఇంత నేరుగా హింసను ప్రోత్సహిస్తారా?' అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టు మార్టానికి కారకులైన వారు పోస్టు మార్టానికే వెళ్తారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. 'రాష్ట్రంలో ఈ విధ్వంస యాత్రలు ఏమిటి.. టైర్ల కింద మనుషుల్ని తొక్కించి నింద ప్రభుత్వంపై వేస్తారు. పరామర్శలకు వెళ్లి బలప్రదర్శనలు చేయటం ఏమిటి. 5 కిలోమీటర్లను 6–7 గంటల ప్రయాణం ఎవరైనా చేస్తారా? ప్రతిపక్షంలో ఉండి పెట్టుబడులు రాకుండా ఇష్టానుసారం మాట్లాడతారా? మేం అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ హెచ్చరికలు చేయటం ఏమిటి? దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా వ్యవహరించలేదు' అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని సీఎం విమర్శించారు. తెలియకుండా జరిగిన నేరంకాదని.. కుట్రతోనే కావాలని చేసిన నేరం ఇది అని అన్నారు. ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోందని వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ ఇచ్చిన నివేదికలో కూడా 'అది కల్తీ నెయ్యి' అని స్పష్టంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా హిందూ మతాలు, పీఠాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినా కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదని సీఎం అన్నారు. ప్రభువా క్షమించు అంటూ సాక్షి పత్రికలో పెద్ద ఎత్తున వార్తలు రాయించుకున్న వ్యక్తి నైవేద్యం కల్తీ చేసి క్షమాపణలు చెప్పరా అని నిలదీశారు. మత సామరస్యాన్ని గౌరవిస్తూ క్షమాపణ చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలిలోనూ ఇదే అంశంపై గొడవ చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తారా అంటూ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని పథకాలు కొనసాగిస్తున్నామని, వచ్చే ఏడాదికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు.

## 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' అమలుపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంత్రి జూపల్లి సమీక్ష

**ఆదిలాబాద్, వెలుతురు మార్చి 6:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణను జిల్లాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు లకు సంబంధించి పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, భూ సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మరమ్మతులు ఏమైనా ఉంటే వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించాలని ఆదేశించారు. వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సీఎంఆర్ వ్యవహారంలో మిల్లర్ల నుంచి ధాన్యం రికవరీ, కేసుల పురోగతి, వంటి అంశాలపై ఏప్రిల్ 30 నాటికి సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితాను ఆధార్, బ్యాంక్ ఖాతాలకు అనుసంధించాలని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని, ఇసుక అక్రమ రవాణా, మైనింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, అమలుకు సాంకేతికతను వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను 10–15 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. కొంతమంది అధికారులు తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నిరాసక్తతను ప్రదర్శిస్తున్నారని, వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారని, దీంతో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆయన అన్నారు. దీంతో బాధితులకు సకాలంలో సాంత్వన లభించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలతో పాటు కుల, నివాస, ఇతర అర్జీలను సకాలంలో ఆన్ లైన్ లో అందేలా చూడాలని చెప్పారు. బాసర సరస్వతీ ఆలయంలో అన్ని సేవలను ఆన్ లైన్ లో అందుబాటులోకి తేవాలని తెలిపారు. బాసర ట్రిపుల్ ఐటిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా, ప్రజా ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అధికారులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో వేగం పెంచి ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. పారదర్శకత, జవాబుదారీతనంతో పని చేసి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెంచాలని అన్నారు. జిల్లాలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు, రోడ్ల భద్రత, సురక్షిత ప్రయాణానికి చర్యలు, సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా పర్యవేక్షణ, పిల్లల భద్రత, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు, విద్య, యువతక్రీడల అభివృద్ధి, మహిళల సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమాలను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సమన్వయంతో అమలు చేసి ప్రజలకు ఫలితాలు కనిపించేలా పనిచేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు, మున్సిపల్ చైర్ పర్సన్ అనూష, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర అధికారులతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

## 9నుంచి పార్లమెంట్ రెండోదశ సమావేశాలు

**న్యూఢిల్లీ,మార్చి6 వెలుతురు:**

కేంద్ర బ్జడెట్‌పై రెండో దశ సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి దశ సమావేశాలు అర్ధాంతరంగా వాయిదాపడ్డాయి. సభలో నెలకొన్న గందరగోళం నేపథ్యంలో సమావేశాల్ని వాయిదా వేశారు. రెండో దశ బ్జడెట్ సమావేశాల్లోనే ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెడతారు. తర్వాత దీనిపై చర్చ, ఓటింగ్ ఉంటాయి. ఈ పక్రియ ప్రారంభమయ్యే వరకు స్పీకర్ చైర్‌లో ఓం బిర్లానే ఉంటారు. సోమవారం ప్రారంభం కానున్న చర్చ సమయంలో మాత్రం ఆయన సాధారణ ఎంపీలాగే సభలో కూర్చుంటారు. పార్లమెంట్ నిబంధనల ప్రకారం ఒక ఎంపీగా.. తన స్పీకర్ పదవిని రక్షిస్తూ మాట్లాడే అవకాశం కూడా ఉంటుంది. తాజా సమావేశాలు ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి. వచ్చే వారం లోక్‌సభలో స్పీకర్‌పై కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం పెట్టబోతుంది. ఈ నేపథ్యంలో ఈ తీర్మానంపై ఉత్కంఠ నెలకొంది. అందుకే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ప్రతి ఒక్కరూ సభలో చర్చ, ఓటింగ్ సందర్భంగా అందుబాటులో ఉండాలని ఆదేశించాయి. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను పదవి నుంచి తొలగించాలని కోరుతూ గత నెలలోనే కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానానికి నోటీస్ ఇచ్చాయి. దీనిపై ఈనెల 9, 10 తేదీల్లో చర్చ, అనంతరం ఓటింగ్ జరగనుంది. అందువల్ల ఈ రెండు రోజుల్లో తమ ఎంపీలు అందరూ సభకు హాజరవ్వాలని, అందుబాటులో ఉండాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ఈ మేరకు తమ ఎంపీలు సభలో ఉండి, ప్రభుత్వానికి మద్దతు తెలపాలని బీజేపీ సూచించింది. స్పీకర్ ఓంబిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని కోరుతూ గత నెలలో ప్రతిపక్షాలకు చెందిన 118 మంది ఎంపీలు సంతకాలు చేసి, నోటీసులు ఇచ్చారు. అయితే, నోటీసు ఇచ్చిన తర్వాత నుంచి సభ వాయిదా పడి కార్యకలాపాలు నిలిచిపోయాయి.

## జహీరాబాద్‌లో వైభవంగా ఇఫ్తార్ విందు

**- గంగాజామున తహెజీబ్‌కు ప్రతీకగా సామరస్య వాతావరణం...**





**జహీరాబాద్ వెలుతురు మార్చి 06:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో గురువారం నిర్వహించిన ఇఫ్తార్ విందు సామాజిక ఐక్యతకు, పరమత సహనానికి ప్రతీకగా నిలిచింది. పట్టణంలోని మూమిన్ మహిళా భాగం 29వ వార్డులో ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పింది. ఇఫ్తార్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మైనార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ మాసూద్ హుస్సేన్ (షాకి ఉస్తాద్) మాట్లాడుతూ, ఇఫ్తార్ విందులు పరస్పర స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, జహీరాబాద్ ప్రాంతం గంగాజామున తహెజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు కలిసికట్టుగా పండుగలను జరుపుకోవడం ఈ ప్రాంత ప్రత్యేకత అని తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం, మాజీ టీజీఐడీసీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్, జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎండీ యూనుస్, కౌన్సిలర్లు నస్రీన్ జావీద్, గౌసొద్దీన్ ఘోరీ, ఎండీ నిజమోద్దీన్, మాడ్గి సర్పంచ్ అర్షద్ జమా పటేల్, ఎంపీజే అధ్యక్షుడు మహ్మద్ అయూబ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ అర్షద్ అలీ, మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ మోయిజ్, మజ్లిస్ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ అథర్ అహ్మద్, జాయింట్ సెక్రటరీ అమిర్ బిన్ అబ్దుల్లా, అడ్వకేట్ అబ్దుల్ సమీ, కాంగ్రెస్ నాయకులు అథర్ గౌరీ, జియా గౌరీ, డాక్టర్ నసీరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ ప్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 13 శాతం HRA అమలు

**- ఏటివో, ఎస్టీవోలకు వినతిపత్రం సమర్పించిన పిఆర్టియు టీఎస్ నాయకులు...**

**- పెరిగిన హౌస్ రెంట్ అలవెన్స్ జహీరాబాద్ పరిసరాల్లో ఉన్న 20 గ్రామాలకు వర్తింపు....**





**జహీరాబాద్ వెలుతురు మార్చి 06:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రస్తుతం ఉన్న 11 శాతం హౌస్ రెంట్ అలవెన్స్ ను 13 శాతానికి పెంచి తక్షణమే అమలు చేయాలని కోరుతూ పిఆర్టియు టీఎస్, జహీరాబాద్ డివిజన్ నాయకులు స్థానిక అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఏటివో శ్రీనివాస్ రెడ్డి, ఎస్టీవో చారి లను కలిసి పెరిగిన హౌస్ రెంట్ అలవెన్స్ అమలుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. హౌస్ రెంట్ అలవెన్స్ అమలుకు అవసరమైన డిస్టెన్స్ సర్టిఫికెట్‌ను సంగారెడ్డి జిల్లా RÊB విభాగం ఈఈ నర్సిములు ఇటీవల జారీ చేసినట్లు తెలిపారు. ఆ సర్టిఫికెట్‌ను అధికారులకు అందజేసి పెరిగిన హౌస్ రెంట్ అలవెన్స్ ను వెంటనే అమలు చేయాలని కోరారు. అలాగే జహీరాబాద్, మొగుడం పల్లి మండలాల ఏంఈవోలు మాణయ్య, జాఫర్ అలీ లకు కూడా డిస్టెన్స్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా పిఆర్టియు టీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డా. తులసిరామ్ రాథోడ్ మాట్లాడుతూ పెరిగిన 13 శాతం హౌస్ రెంట్ అలవెన్స్ జహీరాబాద్ పరిసర ప్రాంతాల్లోని 20 గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శులు, పీహెచ్సి ఉద్యోగులకు వర్తించనున్నదని తెలిపారు. హౌస్ రెంట్ అలవెన్స్ పెంపును వర్తింపజేసేందుకు సహకరించిన సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, జిల్లా =&దీ ఈఈ నర్సిములు, =&దీ జహీరాబాద్ డిఈ రామకృష్ణ, జహీరాబాద్ ఏఈ శ్రీనివాస్, జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ జైత్రామ్ నాయక్, టీపీవో శాంత్ కుమార్ లకు పిఆర్టియు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ వినతిపత్రం సమర్పణ కార్యక్రమంలో పిఆర్టియు టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె. సురేందర్, డి. శ్రీనివాస్, డి. విట్టల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. ఆనంద్, జహీరాబాద్ అర్బన్ అధ్యక్షులు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి తుకారామ్ చవ్హాణ్, జహీరాబాద్ రూరల్ అధ్యక్షులు బాగయ్య, మొగుడం పల్లి ప్రధాన కార్యదర్శి ఆనంద్, నాయకులు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## నాచారం బ్రహ్మోత్సవాలకు కెసిఆర్‌కు ఆహ్వానం



**హైదరాబాద్,మార్చి6 వెలుతురు:**

బీఆర్ఎస్ అధినేత , మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను నాచారం గుట్ట శ్రీ లక్ష్మి నృసింహ స్వామి దేవస్థానం ప్రతినిధులు కలిశారు. ఈ నెల 8 నుంచి 19 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ శుక్రవారం ఆహ్వాన పత్రికను , స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భగా ఆలయ అర్చకులు కేసీఆర్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీందర్ , ఈవో రంగాచారి , అర్చకులు పాల్గొన్నారు.

## విజయవాడ ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా

**- 9న జరిగే మేళాను సద్వినియోగం చేసుకోవాలి**




**విజయవాడ,మార్చి6( వెలుతురు):**
ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా– 2026 ను ఈనెల 9వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు విజయవాడ ప్రభుత్వ ఐటిఐ నందు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా – 2026 లో వివిధ కంపెనీలు హాజరై అర్హులైన ఐటిఐ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని అయన తెలిపారు. ప్రభుత్వ ఐటిఐ లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు గత ఏడాది (2025) తుది సంవత్సరం పరీక్షలు వ్రాసిన విద్యార్థులందరూ అప్రెంటిస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అయన గుర్తు చేశారు. 0వ తరగతి, ఐటిఐ మార్కుల మెమోలు, ఎస్ టి సి సర్టిఫికెట్ లు, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, కుల ధ్రువీకరణ పత్రం మొత్తం మూడు సెట్లు జిరాక్స్ కాపీలు ఒరిజినల్ లతో కూడి అభ్యర్థులు మేళాకు తీసుకురావాలని తెలిపారు. ఃూవున ఐటిఐ పాస్ అయి అప్రెంటిస్ పూర్తి కాని అభ్యర్థులు (అన్ని ట్రేడ్ ల వారు) ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళ – 2026 కు మార్చి 9వ తేదీ ఉదయం 9 గంటలకు గవర్నమెంట్ ఐటిఐ విజయవాడ కేంద్రం లో అన్ని ఒరిజినల్స్ మరియు జిరాక్స్ సెర్టిఫికెట్ లతో హాజరై అర్హత మేరకు ఉద్యోగ అవకాశాలు పొందాలని ప్రిన్సిపల్ కనకారావు తమ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## కూటమిది ఫ్యామిలీ బడ్జెట్

**- అన్ని వర్గాలకు లబ్ది చేకూర్చే యత్నం**

**- ఉచిత సిలిండర్లతో మహిళలపై భారం తగ్గించాం**

**- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం**

**- సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేశాం**

**- మండలిలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్**



**అమరావతి,మార్చి6( వెలుతురు):**
కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. 'ఫ్యామిలీ బడ్జెట్' అని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బడ్జెట్‌పై చర్చలో ఇతర విషయాలు రావడం బాధాకరమన్నారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. ద్రవ్యవినిమయ బిల్లుపై మాట్లాడారు. మహిళలకు ఉచిత సిలిండర్లు ఇచ్చి ఆర్థిక భారం తగ్గించామని అన్నారు. మహిళల సమస్యలు తెలుసు కాబట్టే.. ఉచిత బస్సు సదుపాయం కల్పించామన్నారు. సామాన్యుడికి మేలు చేసేందుకే అన్న క్యాంటీన్లు పెట్టినట్లు వివరించారు. ప్రజా ప్రతినిధులుగా మనం ఏం చేశామన్నదే కీలకం. మనం చేసిన పనులు మాత్రమే చరిత్రలో ఉంటాయి. గత వైకాపా ప్రభుత్వం 153 లక్షల టన్నుల చెత్తను వదిలిపెట్టి వెళ్లింది. ప్రస్తుతం ఆ చెత్తను కూడా తొలగించాల్సి వస్తోంది.బడ్జెట్లో సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం. అప్పులు చేయడం తప్పు అని నేనెప్పుడూ చెప్పలేదు. చేసిన అప్పులను ఎలా ఉపయోగిస్తామనేది కీలకం. రాజకీయ దురుద్దేశంతో ప్రతిపక్షనేతలు ఆరోపణలు చేయవద్దని కోరుతున్నానని పయ్యావుల అన్నారు. అంతకుముందు కాగ్ రిపోర్టుపై ప్రతిపక్ష, పాలకపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. రెవెన్యూ, జీఎస్టీ వసూళ్లలో దేశంలో ఏపీ 22వ స్థానంలో ఉందని బొత్స అన్నారు. సున్నా వడ్డీ కింద ఎవరికీ రుణాలు ఇవ్వడం లేదని, మహిళలను లక్షాధికారులను ఎలా చేస్తారో చెప్పాలని నిలదీశారు. పీఎం ఫసల్‌బీమా యోజన అమల్లో లెక్కలు సరిగా లేవని ఆరోపించారు. మొక్కజొన్న, మామిడి, పొగాకు, మిరప, టమాటా, వరికి గిట్టుబాటు ధర రావడం లేదని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల్లో కొన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. 'సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్' అని మీరే అంటే ఎలా? అని ప్రశ్నించారు. బొత్స ఆరోపణలను మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి ఖండించారు. బొత్సకు వచ్చిన జాబితా ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు. ఆరోపణలు చేసినప్పుడు ఆధారాలు ఇవ్వాలని మంత్రి పయ్యావుల కోరగా.. అబద్దాలు చెప్పాల్సిన అవసరం తమకు లేదని బొత్స అన్నారు.

## ఎపి శాసనసభ నిరవధిక వాయిదా

**- 15 రోజులు సమావేశాలు జరిగాయి**

**- వివరాలు వెల్లడించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**



**అమరావతి,మార్చి6( వెలుతురు):**
ఏపీ శాసనసభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు జరిగేందుకు సహకరించిన అందరికీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృతజ్ఞతలు తెలిపారు. 16వ శాసనసభ ఐదో సమావేశాలు 15 రోజుల పాటు జరిగాయన్నారు. 72 గంటల 14 నిమిషాల పాటు సమావేశాలు జరిగాయని స్పీకర్ తెలిపారు. మొత్తం 122 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారని... 80 ప్రశ్నలకు సభాసమక్షంలో ఉంచారని చెప్పారు. ఈసారి సమావేశాల్లో 18 బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఒక లఘు చర్చ, 344వ నియమం కింద చర్చించిన అంశాలు ఒకటి అని వివరించారు. శాసనసభలో టీడీపీ- 135, జనసేన–21, వైసీపీ–11, బీజేపీ–8 మంది సభ్యులున్నారని స్పీకర్ తెలిపారు. ఈరోజు సాయంత్రం సభ్యుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ కుటుంబసమేతంగా రావాలని స్పీకర్ కోరారు. క్రీడాపోటీల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. 166 పాఠశాలల నుంచి 6,693 విద్యార్థులు అసెంబ్లీని సందర్శించారని.. అసెంబ్లీకి ఇంత భారీ సంఖ్యలో విద్యార్థులు ఎప్పుడూ రాలేదని స్పీకర్ అన్నారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు శాసనసభ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేశారు.

# మంత్రి హామీ ఇచ్చి రెండేళ్లు.. ఇంకా వినియోగంలోకి రాని కమర్షియల్ కాంప్లెక్స్

**- మున్సిపాలిటీకి ఆదాయం నష్టం...**

**- కార్మికుల వేతనాల చెల్లింపుల్లో ఇబ్బంది...**

**- 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్....**

**జహీరాబాద్ వెలుతురు మార్చి 06:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో వ్యాపారాల నిర్వహణ కోసం దుకాణాల కొరతను తీర్చడంతో పాటు మున్సిపాలిటీకి ఆదాయ వనరులు పెంచాలనే లక్ష్యంతో నిర్మించిన సమీకృత వెజ్, నాన్ వెజ్ కమర్షియల్ కాంప్లెక్స్ భవనం రెండేళ్లుగా వినియోగంలోకి రాకపోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. పాత 14వ వార్డు (ప్రస్తుతం 27వ వార్డు) పరిధిలో రూ.11 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భారీ వాణిజ్య సముదాయం ప్రారంభమై సంవత్సరాలు గడిచినా వ్యాపారులకు దుకాణాలు కేటాయించకపోవడంపై స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్ మాట్లాడుతూ, జహీరాబాద్ పట్టణంలో చిన్న వ్యాపారులు, కూరగాయలు మరియు మాంసం వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం ఈ కమర్షియల్ కాంప్లెక్స్‌ను నిర్మించిందన్నారు. భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో 33, మొదటి అంతస్తులో 34 దుకాణాలు కలిపి మొత్తం 67 షాపులు ఏర్పాటు చేయడంతో పాటు సెల్లార్‌లో వెజ్, నాన్ వెజ్ వ్యాపారుల కోసం 84 స్టాళ్లు నిర్మించారని ఆమె తెలిపారు. ఈ భవనాన్ని 2022 డిసెంబర్‌లో అప్పటి మంత్రి టి. హరీష్ రావు ప్రారంభించగా, 2023 ఫిబ్రవరిలో వేలం నిర్వహించి వ్యాపారులను ఎంపిక చేసినట్లు గుర్తుచేశారు. అయితే వేలంలో దుకాణాలు పొందిన వ్యాపారులకు ఇప్పటి వరకు దుకాణాలు అప్పగించకపోవడం వల్ల వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. అదే విధంగా 2024 ఫిబ్రవరిలో జహీరాబాద్ పర్యటనకు వచ్చిన మంత్రి దామోదర్ రాజనర్సింహ మున్సిపాలిటీలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ సమస్యపై స్పందించి జిల్లా కలెక్టర్ సమక్షంలో కాంట్రాక్టర్ నుంచి మున్సిపల్ కమిషనర్‌కు భవనం తాళాలు అప్పగింపజేశారని చెప్పారు. అయినప్పటికీ ఆ తర్వాత కూడా ఈ భవనం వినియోగంలోకి రాకపోవడం పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇంత పెద్ద మొత్తంలో ప్రజల డబ్బుతో నిర్మించిన భవనం ఖాళీగా ఉండిపోవడంతో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం కోల్పోతుందని, దీని ప్రభావం మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపులపై కూడా పడుతోందని పేర్కొన్నారు. పట్టణంలో వ్యాపారుల కోసం నిర్మించిన ఈ సమీకృత మార్కెట్‌ను వెంటనే ప్రారంభించి వ్యాపారులకు దుకాణాలు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు.



అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన ప్రాజెక్టులు నిలిచిపోతే ప్రజలలో ప్రభుత్వంపై నమ్మకం దెబ్బతింటుందని ఆమె అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కమర్షియల్ కాంప్లెక్స్‌ను త్వరితగతిన ప్రారంభించి మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్ కోరారు.



## అగ్నిప్రమాద బాధితులకు ఆపన్నహస్తం

**- నామ స్రవంతి రవికిరణ్ నుండి 20 వేల సహాయం...**

**జహీరాబాద్ వెలుతురు మార్చి 06:**
కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడంలో తాము ఎప్పుడూ ముందుంటామని జహీరాబాద్ నాయకురాలు నామ స్రవంతి రవికిరణ్ మరోసారి నిరూపించుకున్నారు. పట్టణంలోని సుభాష్‌గంజ్ ప్రాంతంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన వ్యాపార దంపతులను ఆమె పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. జహీరాబాద్ పట్టణంలోని సుభాష్‌గంజ్ ప్రాంతానికి చెందిన శృతి, నరేందర్ దంపతులు "సాయి కన్ఫెక్షనరీ" పేరుతో అద్దె దుకాణంలో గత కొన్ని సంవత్సరాలుగా వ్యాపారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే గత నెల ఫిబ్రవరి 19వ తేదీ అర్ధరాత్రి సమయంలో దుకాణంలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ సంభవించి భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దుకాణంలోని సరుకులన్నీ పూర్తిగా దగ్ధమై బూడిద కావడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న నామ స్రవంతి రవికిరణ్ బాధిత కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలసి పరామర్శించారు. కష్టపడి నిర్మించుకున్న వ్యాపారం



కళ్లముందే కాలిపోవడం పట్ల ఆమె విచారం వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్న సామాన్యులకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అగ్నిప్రమాదం వల్ల నష్టపోయిన ఈ కుటుంబం తిరిగి వ్యాపారం ప్రారంభించేందుకు తమ వంతు సహకారంగా రూ.20 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారులు కూడా బాధిత కుటుంబానికి మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ది గ్రైన్ అండ్ సీడ్స్ మర్చంట్ సుభాష్ గంజ్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ పాటిల్, కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్ గుప్తా, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కెసిఆర్‌ను కలిసిన బాల్క సుమన్

**హైదరాబాద్,మార్చి6( వెలుతురు):**
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం కలిశారు. ఇటీవల క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో అరెస్టై జైలుకు వెళ్లి వచ్చిన బాల్క సుమన్ తొలిసారి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్నికల్లో ఎంతో ధైర్యంగా , సమర్ధవంతంగా పనిచేసి మెజారిటీ సభ్యులను గెలిపించు కున్నందుకు, కాంగ్రెస్ దౌర్జన్యాలను తిప్పికొట్టినందుకు బాల్కసుమన్‌ను అభినందించారు. మున్సిపల్ ఎన్నికలు జరిగి నెలరోజులు కావస్తున్నా క్యాతన్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నికకు కాంగ్రెస్ అడ్డం పడుతుంది. మెజారిటీ లేకున్నా బలప్రయోగం, బెదిరింపులతో హస్తగతం చేసుకోవాలని నానా ప్రయత్నాలు చేస్తుంది. ఇందులో భాగంగా క్యాతన్‌పల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ , సీపీఐ అభ్యర్థులు 14 మంది గెలుపొందారు. ఇక సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక లాంఛనమే అన్న తరుణంలో కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, మంత్రి వివేక్ ,ఎంపీ పోలీసుల సహకారంతో అడ్డుపడుతూ వచ్చారు. చివరకు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలులు పెట్టారు.సుమారు 16 రోజుల పాటు బెయిల్ దొరకకుండా అడ్డుపడ్డారు. రెండు రోజుల క్రితం జైలు నుంచి బయటకు వచ్చిన బాల్కసుమన్ నిన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కెసిఆర్‌ను కలిసి తాజా పరిణామాలను బాల్క వివరించారు.

## కొత్తకాపు ఈశ్వరమ్మ మండపం ప్రారంభోత్సవం

**- పాల్గొన్న డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డి...**

**జహీరాబాద్ వెలుతురు మార్చి 06:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మాణిక్ ప్రభు వీధి ప్రాంతంలో కొత్తగా నిర్మించిన కొత్తకాపు ఈశ్వరమ్మ మండపాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్. సిద్ధం ఉజ్వల రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి తో కలిసి ఆయన మండపాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కొత్తకాపు కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండప ప్రారంభోత్సవం సందర్భంగా కుటుంబ సభ్యులు డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం పెంపొందించేందుకు ఇలాంటి సామాజిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజలు



కలిసి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ ముబీన్, జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాములు, సీనియర్ నాయకులు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి, సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి, కౌన్సిలర్ అరుణ్ కుమార్, హర్షవర్ధన్ రెడ్డి, అశ్విన్ పాటిల్, కిరణ్ కుమార్ గౌడ్, రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తకాపు కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తిరుమలలో బర్త్‌డే సెలబ్రేషన్స్

**- దివ్వెల మాధురి,తనూజలపై చర్యకు టిటిడి ఆదేశం**

**తిరుమల,మార్చి6( వెలుతురు):**
తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న దివ్వెల మాధురి, బిగ్ బాస్ ఫేమ్ తనూజ పుట్టస్వామిలపై చర్యలకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమైంది. ఈ వ్యవహారంపై విజిలెన్స్ పోలీసులకు టీటీడీ ఫిర్యాదు చేసింది. తిరుమలలో ఈ తరహా వేడుకలు పూర్తిగా నిషేధమని టీటీడీ ఈ సందర్భంగా పేర్కొంది. ఈ పుట్టిన రోజు వేడుకలను చిత్రీకరించి.. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై అభ్యంతరం తెలిపింది. టీటీడీ ఇచ్చిన ఫిర్యాదుపై విజిలెన్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తిరుమలకు కేక్ తీసుకు వచ్చి.. కట్ చేయడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని విజిలెన్స్‌కు ఇచ్చిన ఫిర్యాదులో టీటీడీ స్పష్టం చేసింది. గతంలోనూ తిరుమలలో దివ్వెల మాధురి, దువ్వాడ శ్రీనివాస్ రీల్స్ చేశారు. దీనిపై విజిలెన్స్ పోలీసులకు టీటీడీ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తిరుమలలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఆ సమయంలో టీటీడీ హెచ్చరించింది. ఆ తర్వాత పలువురు ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే.. వారిపై టీటీడీ చర్యలు కూడా తీసుకున్న విషయం విదితమే. ఇటీవల యూట్యూబర్ గీతూ రాయల్ సైతం తిరుమలలో రీల్స్ చేశారు. దీనిపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా దివ్వెల మాధురి,



తనూజ పుట్టస్వామి జన్మదిన వేడుకలపైనా భక్తులు మండిపడుతున్నారు.

https://epaper.velthuru.com

# వెలుతురు

cinema


## పుట్టినరోజున శ్రీవారిని దర్శించుకున్న జాన్వీ



జాన్వీ కపూర్ తన పుట్టినరోజు సందర్భంగా కలియుగ దైవం శ్రీవారిని దర్శించుకున్నారు. మార్చి 6 తన 29వ పుట్టినరోజును పురస్కరించుకుని తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం కోసం కాలిబాటన తిరుమలకు చేరుకున్నారు. తన పిన్ని నటి మహేశ్వరితో మెట్లమార్గంలో కొండపైకి చేరుకున్న జాన్వీ తెల్లవారుజామున వి.ఐ.పి బ్రేక్ దర్శనంలో స్వామివారిని దర్శించుకుంది. దర్శనం అనంతరం జాన్వీకి రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందించారు. సాంప్రదాయ పట్టు వస్త్రాల్లో మెరిసిపోతున్న జాన్వీని చూసేందుకు భక్తులు ఎగబడగా, ఆమె ఎంతో ఓపికతో వారితో సెల్ఫీలు దిగుతూ కన్పించారు. ప్రస్తుతం తెలుగు సినిమాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఈ భామ, ఇప్పటికే 'దేవర' చిత్రంతో అదరగొట్టి, త్వరలో రామ్ చరణ్ సరసన బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రాబోతున్న భారీ చిత్రం 'పెద్ది' ద్వారా ప్రేక్షకులను పలకరించనున్నారు.

## పెద్ది నుంచి జాన్వీకపూర్ వీడియో విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'లో కథానాయిక జాన్వీ కపూర్ ఈరోజు తన 29వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఆమెకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ ఒక స్పెషల్ వీడియోను విడుదల చేసింది. కాటుక అక్కర్లేని ఆ కళ్లు, ముక్కుపుడక అక్కర్లేని ఆ ముక్కు.. అంటే అలంకరణ అక్కర్లేని అరుదైన చికిరియే ఈ చికిరి.. అంటూ దర్శకుడు బుచ్చిబాబు సనా జాన్వీని ప్రశంసిస్తూ ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో జాన్వీ 'అచ్చియమ్మ' అనే పల్లెటూరి యువతి పాత్రలో నటిస్తుంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సహకారంతో వృద్ధి సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 30 న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో జాన్వీ కపూర్ 'అచియమ్మ' అనే పాత్రలో కనిపించబోతోంది. బుచ్చిబాబు తన ట్వీట్‌లో.. 'నీతో వర్క్ చేయడం చాలా సంతోషంగా ఉంది. స్క్రీన్ మీద అచియమ్మగా నీ పవర్‌ఫుల్ అవతారాన్ని ప్రపంచం చూడబోతున్నందుకు నేను చాలా ఎ÷-జగైటెడ్‌గా ఉన్నాను' అంటూ పేర్కొన్నారు. విడుదలైన పోస్టర్‌లో జాన్వీ లుక్ అందరినీ ఆకట్టుకుంటోంది. గతంలో శ్రీదేవి - చిరంజీవి జోడీ వెండితెరపై సృష్టించిన మ్యాజిక్ గురించి తెలిసిందే. ఇప్పుడు వారి వారసులు రామ్ చరణ్ - జాన్వీ కపూర్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.




# ఆసక్తిగా సాగే..'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'




టాలీవుడ్ సీనియర్ నటీనటులు శివాజీ, లయ సుదీర్ఘ విరామం తర్వాత జంటగా నటించిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ క్రైమ్ కామెడీ డ్రామాను శివాజీ స్వయంగా నిర్మించారు. భారీ అంచనాల మధ్య శుక్రవారం విడుదలైంది. హార్షిలి హిల్స్‌లో నివసించే శ్రీరామ్ (శివాజీ) ఒక నిజాయితీ గల పంచాయతీ కార్యదర్శి. తన భార్య ఉత్తర (లయ), రీల్స్ పిచ్చితో వింత పనులు చేసే కొడుకు నితిన్ అలియాస్ బిట్టు (రోహన్)తో కలిసి సాధారణ జీవితం గడుపుతుంటాడు. అయితే, ఆడవాళ్ల పిచ్చి ఉన్న స్థానిక ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్), శ్రీరామ్ లేని సమయంలో ఉత్తరపై కన్నేసి వారి ఇంటికి వస్తాడు. కానీ ఊహించని విధంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. అసలు కథ ఇక్కడే మొదలవుతుంది. ఆ హత్య కేసు నుండి తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి శ్రీరామ్ ఏం చేశాడు? శవాన్ని మాయం చేసే క్రమంలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులేంటి? మరోవైపు కోటి రూపాయల గిఫ్ట్ బ్యాగ్ కోసం ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట ఎందుకు పడింది? ఈ గందరగోళంలో కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్) పాత్ర ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ చిత్రం. దర్శకుడు సుధీర్ శ్రీరామ్ ఒక డార్క్ క్రైమ్ థ్రిల్లర్‌ను వినోదాత్మకంగా మలచడంలో సఫలమయ్యాడని చెప్పవచ్చు. కథలో పెద్దగా కొత్తదనం లేకపోయినప్పటికీ, పాత్రల చిత్రణ మరియు కథనాన్ని నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సినిమా ఆరంభంలో పాత్రల పరిచయం, ఆ తర్వాత వచ్చే మలుపులు ప్రేక్షకుడిని కథలోకి తీసుకెళ్తాయి. అయితే ఎప్పుడైతే హత్య జరుగుతుందో, అక్కడి నుండి కథ థ్రిల్లింగ్ మోడ్‌లోకి మారుతుంది. శవాన్ని మాయం చేసేందుకు హీరో వేసే ప్లాన్లు, మరోవైపు ఎమ్మెల్యే మనుషుల నుంచి తప్పించుకునే సీన్లు ఆసక్తిని కలిగిస్తాయి. అయితే, ద్వితీయార్థంలో అక్కడక్కడా కథనం కాస్త నెమ్మదించినట్లు అనిపిస్తుంది. శివాజీ తనదైన టైమింగ్ మరియు అనుభవంతో శ్రీరామ్ పాత్రలో ఒదిగిపోయారు. మధ్యతరగతి తండ్రి పడే తపనను చక్కగా పండించారు. చాలా కాలం తర్వాత తెరపై కనిపించినా, తన నటనతో అలరించింది లయ. ఇక కొడుకు పాత్రలో రోహన్ తన అల్లరితో నవ్వించగా, ధనరాజ్ పాత్ర చివరిలో సర్ప్రైజ్ చేస్తుంది. శరత్ లోహితాశ్వ, ప్రిన్స్ తమ పరిధి మేరకు నటించారు.




## క్రైమ్ థ్రిల్లర్‌గా మృత్యుంజయ్

గత వారం 'విష్ణు విన్యాసం'తో నవ్వులు పూయించిన టాలీవుడ్ నటుడు శ్రీవిష్ణు గ్యాప్ లేకుండా మరో కొత్త సినిమాతో ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం మృత్యుంజయ్. రెబా మోనికా జాన్ కథానాయికగా నటించగా.. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహించాడు. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. క్రైమ్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంది అనేది రివ్యూలో చూద్దాం. శ్రీవిష్ణు ఒక న్యూస్ రిపోర్టర్. క్రైమ్ బ్యూరోలో పనిచేయాలనేది తన కల, కానీ అవకాశం దొరకక ప్రస్తుతానికి అడ్వర్టైజ్‌మెంట్ విభాగంలో పనిచేస్తుంటాడు. ఎవరైనా మరణిస్తే, వారి ఇంటికి వెళ్లి ఆ వ్యక్తి గొప్పతనం గురించి రాసి, కుటుంబ సభ్యుల నుండి శ్రద్ధాంజలి ప్రకటనలు సేకరించడం అతడి వృత్తి. ఈ క్రమంలో అచ్యుత్ రావు (బాలాదిత్య) మరణం జయ్‌ను కదిలిస్తుంది. అచ్యుత్ కూతురు అంజలి తన తండ్రి మరణం వెనుక ఉన్న కారణాన్ని అడగడంతో, జయ్ ఆ బాధ్యతను భుజానికెత్తుకుంటాడు. వరుసగా జరుగుతున్న కొన్ని మరణాలు ప్రమాదాలు కావని, పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతున్న హత్యలని జయ్ గుర్తిస్తాడు. ఈ కేసును ఇన్వెస్టిగేట్ చేస్తున్న ఐపీఎస్ అధికారి సీత (రెబా మోనికా జాన్)తో కలిసి జయ్ ఆ హంతకుడిని ఎలా పట్టుకున్నాడు? ఆ కిల్లర్ అసలు లక్ష్యం ఏమిటి? అన్నదే మిగతా కథ. ర్శకుడు హుస్సేన్ షా కిరణ్ ఒక విభిన్నమైన పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించారు. కేవలం హత్యలు, ఇన్వెస్టిగేషన్ మాత్రమే కాకుండా, హీరో-విలన్ మధ్య సాగే మైండ్ గేమ్ సినిమాకు ప్రధాన బలమై నిలిచింది. సినిమా ప్రారంభంలో పాత్రల పరిచయం, హీరో చేసే వింతైన ఉద్యోగం ఆసక్తికరంగా ఉంటాయి. అయితే కథ అసలు పాయింట్‌కి రావడానికి కొంత సమయం తీసుకుంటుంది. ద్వితియార్థంలో సినిమా వేగం పెరుగుతుంది. హీరో-విలన్ ఒకరికొకరు తెలియకుండానే ఎదురుపడే సన్నివేశాలు, ఒకరి ఎత్తులకు మరొకరు పై?త్తులు వేయడం ఉత్కంఠను కలిగిస్తాయి. ముఖ్యంగా క్లైమాక్స్ వరకు సస్పెన్స్ మెయింటైన్ చేయడంలో దర్శకుడు సఫలమయ్యారు. శ్రీవిష్ణు తన మార్కు కామెడీని పక్కన పెట్టి, చాలా సీరియస్ రోల్‌లో ఒదిగిపోయాడు. ఆయన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ పాత్రకు తగ్గట్లుగా ఉన్నాయి. రెబా మోనికా జాన్ కేవలం గ్లామర్ కోసమే కాకుండా, ఒక బాధ్యతాయుతమైన పోలీస్ ఆఫీసర్ పాత్రలో మెప్పించింది. వీర్ ఆర్యన్ ప్రతినాయకుడిగా వీర్ ఆర్యన్ నటన ఆకట్టుకుంటుంది. కొన్ని సీన్స్‌లో తన నటనతో భయపెట్టారు.

## వృషకర్మ గ్లింప్స్ అద్భుతం - సుకుమార్



యువసామ్రాట్ నాగచైతన్య నటిస్తున్న మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' ఫస్ట్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ గ్లింప్స్ చూసిన ప్రముఖ దర్శకుడు సుకుమార్, చిత్ర బృందంపై ప్రశంసల వర్షం కురిపించారు. సుకుమార్ రైటింగ్స్ కూడా ఈ నిర్మాణంలో భాగస్వామి కావడంతో, ఆయన ఈ అవుట్‌పుట్ పట్ల ఎంతో సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.సుకుమార్ అభినందనలపై నాగచైతన్య ట్విట్టర్ (ఛీ) వేదికగా స్పందిస్తూ.. 'థాంక్యూ సుకుమార్ గారు. మీలాంటి విజనరీ నుంచి ఇలాంటి మాటలు రావడం మాకు ఎంతో గౌరవంగా ఉంది. మీ ప్రశంసలు మాకు ఎంతో స్ఫూర్తినిస్తాయి' అంటూ కృతజ్ఞతలు తెలిపారు. కార్తీక్ దండు రూపొందించిన ఈ సూపర్ నేచురల్ ప్రపంచం సుకుమార్‌ను సైతం ఆశ్చర్యపరిచిందని చైతూ ట్వీట్ ద్వారా స్పష్టమవుతోంది. గతంలో కార్తీక్ దండు రూపొందించిన 'విరూపాక్ష' చిత్రానికి సుకుమార్ స్క్రీన్ ప్లే అందించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'వృషకర్మ'తో తన శిష్యుడు మరో అద్భుతాన్ని వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడని సుకుమార్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. దీంతో ఈ గురు-శిష్యుల బాండింగ్.. చైతన్యతో వారి అనుబంధం సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.







## మాస్ రోల్‌లో శర్వానంద్..

# భోగి

ఇటీవలే 'నారీ నారీ నడుమ మురారి'తో క్లాస్ హిట్ అందుకున్న శర్వానంద్, ఇప్పుడు రూట్ మార్చి పూర్తి స్థాయి మాస్ రోల్‌లో కనిపించబోతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భోగి' చిత్రంలో నటిస్తుండగా. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'ధమాకా' ఫేమ్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండటంతో పాటలపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన శర్వానంద్ లుక్ చూస్తుంటే, బాక్సాఫీస్ వద్ద ఈసారి మాస్ జాతర ఖాయమనిపిస్తోంది. దీనికి తోడు నేడు శర్వానంద్ పుట్టినరోజును పురస్కరించుకుని మేకర్స్ ఒక స్పెషల్ రఫ్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. దర్శకుడు సంపత్ నంది ఈ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. 'మొన్న గంగని చూశారు.. ఇప్పుడు పెను గంగని చూడండి' అంటూ తన హీరో క్యారెక్టర్‌కు పవర్‌ఫుల్ ఎలివేషన్ ఇచ్చారు. ఈ పోస్టర్‌లో శర్వానంద్ గడ్డంతో, ఇంటెన్స్ లుక్‌లో చాలా డైనమిక్ గా కనిపిస్తున్నారు. శర్వానంద్ కెరీర్‌లోనే ఇది మోస్ట్ మాస్ ఫిల్మ్ అవుతుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇక శ్రీ శ్రీనివాస సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 28, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ప్రజంట్ శర్వ లుక్ వైరల్ అవుతుంది.

# ప్రభుత్వ పథకాల చేయూతతో స్వయం సహాయక సంఘాల

## మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

## హైదరాబాద్ ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్


















**హైదరాబాద్, వెలుతురు మార్చి 06, 2026:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని హైదరాబాద్ ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మాసాబ్ ట్యాంక్ లోని చాచా నెహ్రూ పార్క్ లో జీహెచ్ఎంసీ పరిధిలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, వార్డులు, మున్సిపాలిటీల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ఈ 99 రోజుల కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 వేల గ్రామాలు, వార్డులు, మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాల కియోస్క్ లను మంత్రి ప్రారంభించారు. ఇళ్లలో పాడైపోయిన టీవీలు, ఫ్రిజ్‌లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఇళ్లలోనే ఉంచకుండా ఈ కేంద్రాలకు తీసుకువచ్చి రీసైక్లింగ్ చేయాలని ప్రజలకు సూచించారు. అలాగే 1500 చదరపు గజాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అద్దాల లైబ్రరీని ప్రారంభించారు. స్థానిక ప్రజల్లో పఠన అలవాటును పెంపొందించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. పుస్తకాలను దానం చేసేందుకు ప్రత్యేక సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యులకు రూ.35 కోట్ల జీరో వడ్డీ రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అదేవిధంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. దీని ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళల పేర్లపై రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు వివరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల్లో చేరి ప్రభుత్వం అందిస్తున్న సున్నా వడ్డీ రుణాలను వినియోగించుకుని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించారు. సెట్విన్ (రాజుఔ×చీ) వంటి శిక్షణ సంస్థల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచేందుకు శిక్షణ కార్యక్రమాలు, కుట్టు మిషన్ల పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాదులోని స్వయం సహాయక సంఘాల మహిళలు ముందుకు వస్తే గ్రామీణ ప్రాంతాలలోని ూ౧+ ల ఆర్టీసీ బస్సుల యజమానులను చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో మహిళలు చురుకుగా పాల్గొని విద్య, వైద్యం, పర్యావరణం, భద్రత తదితర రంగాల్లో ముందంజలో నిలవాలని మంత్రి పిలుపునిచ్చారు. మహిళలు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలు, ×దీవీ, ూ+, ఝుతీష్ర ూవఅంవ, =వఖుఝుతీ, ఝుఅజఅతీశీ ,=వశ్రీఃఖుఅ సంస్థలు కలిసి చాచా నెహ్రూ పార్క్ వద్ద ఈ-వేస్ట్ సేకరణ కోసం ప్రత్యేక కియోస్క్‌లను ఏర్పాటు చేశాయి. కార్యక్రమానికి మహిళలు ఇందిరమ్మ చీరలు ధరించి హాజరుకావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, హైదరాబాద్ గ్రంథాలయ సమితి చైర్మన్ కె. ఉపేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన , గోల్కొండ జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి, అదనపు కమిషనర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


# ఎత్తైన కొండల్లో... అసోం తెగ ప్రజలతో...

- ఆర్మీ చాపర్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటన
- హఫ్లాంగ్, సంప్రదీసా గ్రామాల్లోని అభివృద్ధి పనుల పురోగతిపై ప్రత్యక్షంగా పరిశీలించిన కేంద్ర మంత్రి
- వివిధ శాఖల అధికారులు, సివిల్ సొసైటీ నాయకులు, అటానమస్ కౌన్సిల్ సభ్యులతో భేటీలి
- అసోం నుండి నాగాలాండ్ కు చేరుకున్న కేంద్ర మంత్రి
- నేడు అసోం రైఫిల్స్ లో చేరిన సైనికుల ప్రమాణోత్సవ కార్యక్రమంలో ప్రసంగించనున్న బండి సంజయ్













**అసోం వెలుతురు మార్చి 06:** ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రెండో రోజైన శుక్రవారం నాడు అసోం రాష్ట్రంలోనే ఎత్తైన కొండ ప్రాంతమైన దిమా హసావో జిల్లాలోని హఫ్లాంగ్ ప్రాంతంలో లో పర్యటించారు. ఉదయం 9.30 గంటలకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కు చెందిన మిగ్ 17 చాపర్ లో గౌహతి నుండి బయలు దేరిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తొలుత హఫ్లాంగ్ కు చేరుకున్నారు. అక్కడ అటానమస్ కౌన్సిల్ సభ్యులతోపాటు వివిధ శాఖల అధికారులు, సివిల్ సొసైటీ నాయకులతో సమావేశమయ్యారు. విద్య, వైద్యం, రోడ్లు, లా అండ్ ఆర్డర్, మౌలిక సదుపాయాల కల్పన విషయంలో వారి నుండి సలహాలు సూచనలు తీసుకున్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ది పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు.

తొలుత పీఎంశ్రీ నిధులతో నడుస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. పీఎం శ్రీ నిధులతో చేపట్టిన కార్యక్రమాలను, అభివృద్ధి పనులను పరిశీలించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, మిడ్ డే మిల్స్ సెక్షన్, కిచెన్ గార్డెన్, స్మార్ట్ రూం లను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ఇంటరాక్షన్ అయ్యారు. స్కూల్లో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి స్టేడియంకు వెళ్లారు. దాదాపు రూ.16.5 కోట్లతో చేపట్టిన స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సివిల్ ఆసుపత్రికి వెళ్లి రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అక్కడున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాను సైతం కంటి పరీక్ష చేయించుకున్నారు.

అనంతరం హఫ్లాంగ్ నుండి నేరుగా రోడ్డు ప్రయాణంలో అత్యంత ఎత్తైన కొండపైనున్న సమ్‌ప్రదీసా అనే మారుమూల గ్రామానికి బయలు దేరారు. సముద్ర మట్టానికి 680 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతం గూండా ప్రయాణించడం కష్టసాధ్యమైంది. కొట్టుకుపోయిన రోడ్లు, ఆ రోడ్డుకు ఒకవైపు కొండ చరియలు, మరోవైపు లోయ... సంక్లిష్టమైన ప్రయాణం అయినప్పటికీ అవేవీ లెక్క చేయకుండా సమ్ ప్రదీసా గ్రామానికి వెళ్లారు. కేంద్ర మంత్రి రాకను పురస్కరించుకుని అక్కడి తెగ ప్రజలు సాంప్రదాయ నృత్యాలు, డప్పు చప్పళ్లతో స్వాగతం పలికారు. కేంద్ర నిధులతో ఆ గ్రామంలో చేపట్టిన అంగన్ వాడీ సెంటర్, స్కూల్, హెల్త్ సబ్ సెంటర్, జల్ జీవన్ మిషన్, పీఎం ఆవాస్ యోజన పథకంతో నిర్మించిన ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ముఖ్యంగా ఆ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సరిగా లేదనే విషయాన్ని గ్రహించిన కేంద్ర మంత్రి రోడ్డు నిర్మాణం పనులు ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. కొండ ప్రాంతమైన వర్షమొచ్చినా ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఇంటర్ లాకింగ్ బ్లాక్ పేవ్మెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. నిర్ణీత వ్యవధిలోనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తామని చెప్పారు.

అనంతరం అంగన్ వాడీ సెంటర్ కు వెళ్లి పిల్లలను, వారి తల్లిదండ్రులను కలిశారు. అక్కడ అందిస్తున్న పోషకాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి తెగకు చెందిన ప్రజలతో కొద్దిసేపు సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాదాపు గంటకుపైగా ఆ కొండ ప్రాంతంలో ఉన్న కేంద్ర మంత్రి తిరిగి సాయంత్రం 3.30 గంటలకు హఫ్లాంగ్ కు తిరిగొచ్చారు. అక్కడి నుండి మిగ్ 17 చాపర్లో నాగాలాండ్ లోని దిమాపుర ఎయిర్ పోర్టుకు వెళ్లారు. అక్కడి నుండి సుఖోవిలోనున్న అసోం రైఫిల్స్ సెంటర్ అండ్ స్కూల్ కు వెళ్లారు. రేపు ఉదయం అసోం రైఫిల్స్ లో నూతనంగా చేరిన సైనికుల బాధ్యతల స్వీకార కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు.





Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com